



PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక



Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456

సంపుటి: 5 సంచిక: 309, పేజీలు - 08

మంగళవారం, ఏప్రిల్ 28, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## బీఆర్ఎస్ ఒక శవం..
# ఎన్ని అలంకరణలు చేసినా వృథా
### - చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ పార్టీ చాప్టర్ ముగిసిపోయిందని, ఆ పార్టీకి ఇక భవిష్యత్తు లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన సందర్భంలో కీలక వ్యాఖ్యలు చేశారు. చనిపోయిన శవానికి ఎంత అలంకరణ చేసినా అది తిరిగి లేచి వస్తుందా? బీఆర్ఎస్ పరిస్థితి కూడా ఇప్పుడు అలాగే ఉందని తేల్చారు. కవిత పెట్టిన పార్టీపైనా స్పందించారు. కొత్త పార్టీల గురించి ఆలోచించేకంటే, ఉన్న పార్టీయే ఉంటుందో ఊడుతుందో చూసుకోవాలని ఎద్దేవా చేశారు. ప్రజలు ఎంతో ఆకాంక్షతో అధికారం ఇస్తే, కేసీఆర్ కుటుంబం అహంకారంతో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని, అందుకే ప్రజలు వారికి ఎన్నికల్లో గుండు సున్నా ఇచ్చి పంపించారని మండిపడ్డారు.

#### కుటుంబ ప్రయోజనాల కోసమే తాపత్రయం

బీఆర్ఎస్ ఇప్పుడు కేవలం ఒక కుటుంబం కోసమే పనిచేస్తోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ కుటుంబంతో ప్రజలకు సంబంధాలు తెగిపోయాయని, ఇప్పుడు ఆ ఇంట్లో జరుగుతున్న పంపకాల పంచాయతీ వల్లే అనుబంధ సంస్థలు, కొత్త రాజకీయ సమీకరణలు పుట్టుకొస్తున్నాయని వ్యాఖ్యానించారు. వారసత్వ సంపద కోసం, అధికారం కోసం ఆ కుటుంబ సభ్యులే ఒకరిపై ఒకరు ఆధిపత్యం ప్రదర్శించుకుంటున్నారని ఆయన ఆరోపించారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడే తన కొడుకు కేటీఆర్‌ను సీఎం చేయాలని ప్రయత్నించారని,

2లో..

## బీజేపీ ఆప్ ఎంపీల విలీనానికి రాజ్యసభ చైర్మన్ ఆమోదం
### - పెద్దల సభలో పెరిగిన బీజేపీ బలం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) రాజ్యసభలో బీజేపీలో ఏడుగురు ఆప్ ఎంపీల విలీనం అధికారికంగా పూర్తైంది. రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ బీజేపీలోకి ఏడుగురు ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీల విలీనాన్ని అధికారికంగా ఆమోదించారు. దీంతో రాజ్యసభలో బీజేపీ బలం 113కు పెరిగింది. ఇటీవల ఏడుగురు రాజ్యసభ సభ్యులు ఆమ్ ఆద్మీ పార్టీకి గుడ్ బై చెప్పి బీజేపీలో చేరిన సంగతి తెలిసిందే. రాజ్యాంగ నిబంధనల ప్రకారం తమను బీజేపీలో విలీనం చేయాలని రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌ను కోరారు. విలీనం పూర్తయిన తర్వాత తమను బీజేపీ ఎంపీలుగానే పరిగణించాలని

2లో..

## ఆ జడ్డి ముందు నేనస్సలే హాజరు కాను
### - విచారణకు రావాలని కోరిన కోర్టుకు కేజ్రీవాల్ షాక్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీ హైకోర్టులో జరుగుతున్న విచారణకు హాజరు కావడానికి ఆయన నిరాకరించారు. ఈ మేరకు జస్టిస్ స్వర్ణకాంత శర్మకు ఒక లేఖ రాస్తూ వ్యక్తిగతంగా గానీ, తన తరపు న్యాయవాది ద్వారా గానీ కోర్టు ముందు హాజరు కాబోనని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం ఇప్పుడు దేశ రాజధానిలో రాజకీయ, న్యాయ వర్గాల్లో పెను దుమారం రేపుతోంది.

#### సత్యాగ్రహ మార్గమే శరణ్యమంటూ

హైకోర్టులో తనకు నిష్పక్షపాతంగా న్యాయం జరుగుతుందనే ఆశ లేదని కేజ్రీవాల్ తన లేఖలో బాహాటంగానే పేర్కొన్నారు. న్యాయస్థానంపై నమ్మకం కోల్పోయిన తరుణంలో తాను మహాత్మా గాంధీ చూపిన సత్యాగ్రహ మార్గాన్ని ఎంచుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే గాంధీ విగ్రహం ఎదుట దీక్షకు దిగనున్నట్లు ఆయన వెల్లడించారు. "జీవితంలో కొన్నిసార్లు గెలుపు ఓటముల కంటే సిద్ధాంతాలే ముఖ్యం. కష్టమైనా సరే సత్య మార్గంలోనే నడవాలని నిర్ణయించుకున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు.

#### జస్టిస్ స్వర్ణకాంత శర్మ తీర్పుపై అభ్యంతరం

గతంలో తనపై నమోదైన తప్పుడు కేసుల్లో న్యాయస్థానాలు నిర్దోషిగా ప్రకటించాయని గుర్తు చేసిన కేజ్రీవాల్ ప్రస్తుత కేసు మళ్లీ జస్టిస్ స్వర్ణకాంత శర్మ ముందుకు రావడంపై అసహనం వ్యక్తం చేశారు.

2లో..

## కాంగ్రెస్, బీజేపీ ఎంపీలకు
# తెలంగాణ పౌరుషం లేదా.?
### - బీఆర్ఎస్ కార్యవర్గ సమావేశంలో కేసీఆర్ నిప్పులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడిన వారిని ఎండగట్టడంలో రాష్ట్ర ఎంపీలు విఫలమయ్యారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన పార్టీ నేతలను ఉద్దేశించి మాట్లాడారు. పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ ఏర్పాటును భారత్-పాక్ విభజనతో పోలుస్తూ అవమానకర వ్యాఖ్యలు చేస్తే, రాష్ట్రానికి చెందిన 16 మంది ఎంపీలు మౌనంగా ఉండటం సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ ఎంపీలు తెలంగాణలో పుట్టలేదా? వీరికి పౌరుషం లేదా? అదే ఒక్క బీఆర్ఎస్ ఎంపీ సభలో ఉన్నా రణరంగం చేసి, సదరు ఎంపీతో క్షమాపణ చెప్పించేవాళ్లం అని కేసీఆర్ స్పష్టం చేశారు.

#### కూల్చడంలోనే ఈ ప్రభుత్వం నంబర్ వన్

రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కేసీఆర్ విమర్శల వర్షం కురిపించారు. తాము పదేళ్ల కాలంలో తెలంగాణను అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలబెడితే, ప్రస్తుత పాలకులు భూకబ్జాలు, కూల్చివేతల్లో రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో ఉంచుతున్నారని

2లో..

## టెక్నాలజీతో నాణ్యమైన
# వైద్యసేవలు
### - సాంకేతికత భవిష్యత్తులో వైద్య సేవల రూపురేఖలను మార్చేస్తుందన్న చంద్రబాబు



అమరావతి (ప్రశ్న న్యూస్) టెక్నాలజీని సమర్థంగా వినియోగిస్తే వైద్య సేవలను ప్రజలకు మరింత సులభతరం చేయవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబును నారాయణ మెడికల్ కాలేజీ-ఆసుపత్రులు, జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ-ఆసుపత్రుల యజమాన్యాలకు చెందిన ప్రతినిధులు కలిశారు. ఇటీవల తమ రెండు ఆసుపత్రులు కలిసి టెలి-రోబోటిక్ సర్జరీ నిర్వహించినట్టు సీఎం చంద్రబాబు దృష్టికి తెచ్చారు. టెలి-రోబోటిక్ సర్జరీ జరిగిన తీరును ఆయా మెడికల్ సంస్థల యాజమాన్యాలకు చెందిన ప్రతినిధులు సింధూర,

2లో..

## అట్టహాసంగా ఏయూ శతాబ్ది
# ఉత్సవాల ముగింపు వేడుక

- ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి.. హాజరైన సీఎం చంద్రబాబు
- పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, గవర్నర్లు, ప్రజాప్రతినిధుల హాజరు
- వేడుకల్లో పాల్గొన్న క్రికెట్ దిగ్గజం సచిన్, సినీ దర్శకుడు త్రివిక్రమ్
- 25 వేల మందికి పైగా విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో నిండిన ప్రాంగణం






విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) తెలుగు జాతి గర్వకారణం, విజ్ఞానపు గని అయిన విశాఖ ఆంధ్ర యూనివర్సిటీ తన వందేళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఒక చారిత్రక మైలురాయిని అధిగమించింది. 1926 ఏప్రిల్ 26న ప్రారంభమైన ఈ విశ్వవిద్యాలయం, దశాబ్దాలుగా ఎందరో మేధావులను, నాయకులను, శాస్త్రవేత్తలను దేశానికి అందించింది. గడిచిన ఏడాది కాలంగా జరుగుతున్న శతాబ్ది సంబరాలు తాజాగా అట్టహాసంగా ముగిశాయి. ఈ ముగింపు వేడుక కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదు. రాబోయే వందేళ్ల భవిష్యత్‌కు బలమైన పునాదిగా నిలిచింది. ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది వేడుకల ముగింపు కార్యక్రమం ఏయు ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో అత్యంత వైభవంగా సాగింది. 1923లో అడుగులు వేసిన ఈ విద్యాసంస్థ, 2026 నాటికి వందేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా గత

2లో..

## చాలా పార్టీలు వస్తూంటాయి,
# పోతూంటాయి
### - కవిత పార్టీపై కేటీఆర్ ఫస్ట్ రియాక్షన్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కల్వకుంట్ల కవిత తెలంగాణ రాష్ట్ర సేన పార్టీని ప్రకటించడంపై కేటీఆర్ భిన్నంగా స్పందించారు. తెలంగాణలో చాలా పార్టీలు వచ్చాయి. పోయాయని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. పాతికేళ్లు పూర్తి చేసుకున్న పార్టీలు చాలా తక్కువన్నారు. కేసీఆర్ గురించి చాలా మంది మాట్లాడుతున్నారని వారి గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. పార్టీ కార్యవర్గ సమావేశం తర్వాత కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పార్టీలో అంతర్గతంగా ఎవరైనా సూచనలు ఇవ్వవచ్చని, అంతమాత్రాన

2లో..

## కాంగ్రెస్ పార్టీలో
# చేరడం రిస్కీ పని
### - యువతి సమాధానంతో రాహుల్ గాంధీ నవ్వులు



2లో..

## పద్మశ్రీ అవార్డులు-2027
### - నామినేషన్లకు తుది గడువు జూలై 31



2లో..

## ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్ ప్రమాణం
### - హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎంపికైన ప్రొఫెసర్ కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్‌లు సోమవారం (ఏప్రిల్ 27న) ప్రమాణస్వీకారం చేశారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారిద్దరితో ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రివర్గ సహచరులు, పలువురు ప్రజాప్రతినిధులు హాజరై నూతన ఎమ్మెల్సీలకు అభినందనలు తెలిపారు. అంతకుముందు, ఆదివారం నాడు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాల మేరకు వీరి నియామకానికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది.

#### - మైనార్టీల సంక్షేమమే నా లక్ష్యం ఎమ్మెల్సీ అజారుద్దీన్

ప్రమాణస్వీకారం అనంతరం

2లో..

## మహిళా, పిల్లల రక్షణకు "స్పందన"
### - మహిళల భద్రత కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళల సంక్షేమం, భద్రత కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్న సంగతి తెలిసిందే. మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలులోకి తీసుకువచ్చింది. అలాగే మహిళల భద్రత కోసం షీటీమ్స్‌తోపాటు ప్రత్యేక యాప్‌ను సైతం అమలులోకి తీసుకువచ్చింది. తాజాగా మరో కీలక నిర్ణయ తీసుకుంది ప్రజా భద్రత, అత్యవసర సమయాల్లో సత్వర స్పందనే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం స్పందన టీమ్‌లను

2లో..

## మే 4న బెంగాల్‌లో మిఠాయిలు పంచుతాం
### - ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు



కోల్కతా (ప్రశ్న న్యూస్) మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి తాను తిరిగి బెంగాల్ వస్తానని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో సోమవారం బారక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన చివరి ర్యాలీలో మాట్లాడుతూ, బీజేపీ అధికారంలోకి వస్తుందనే ఉత్సాహంతో తాను ఢిల్లీకి వెళుతున్నానని అన్నారు. తాను హెలిప్యాడ్ దిగి వస్తుంటే దాదాపు 2 కిలోమీటర్ల మేర ప్రజలు ఎదురుచూస్తూ ఉన్నారని తెలిపారు. తనను ఆశీర్వదించడానికి ఇంతమంది ప్రజలు వస్తారని ఊహించలేదని అన్నారు. రాజకీయాల్లోకి వచ్చి బీజేపీలో చేరిన తర్వాత ఒక కార్యకర్తగా పార్టీ ఏది చేయమన్నా అది చేశానని అన్నారు. తనకు ప్రత్యేకంగా ఒక కుటుంబం అంటూ లేదని, దేశ ప్రజలే తన కుటుంబమని వ్యాఖ్యానించారు.గత నాలుగు దశాబ్దాలుగా తాను దేశంలోని ప్రతి ప్రాంతంలో పర్యటిస్తున్నానని

2లో..

## ఇంధన కొరత ఏర్పడినందుకు చంద్రబాబు సిగ్గుపడాలి

2లో..



# పద్మశ్రీ అవార్డులు-2027

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశంలో అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డులకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కీలక ప్రకటన చేసింది. 2027 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రదానం చేసే పద్మ అవార్డుల కోసం నామినేషన్లు లేదా సిఫార్సులు పంపేందుకు జూలై 31వ తేదీని తుది గడువుగా నిర్ణయించినట్లు సోమవారం వెల్లడించింది. ఈ ఏడాది మార్చి 15న ప్రారంభమైన ఈ ప్రక్రియలో భాగంగా, నామినేషన్లను కేవలం రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించనున్నట్లు స్పష్టం చేసింది. దేశంలో పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అత్యంత గౌరవప్రదమైన పురస్కారాలుగా గుర్తింపు పొందాయి.నామినేషన్లు పంపేవారు సంబంధిత వ్యక్తి సాధించిన అసాధారణ విజయాలు, సేవలను వివరిస్తూ గరిష్ఠంగా 800 పదాలకు మించకుండా ఒక సైటేషన్ జతచేయాలని హోం శాఖ సూచించింది. పద్మ అవార్డులను "ప్రజల పద్మ" (పీపుల్స్ పద్మ)గా మార్చాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, కాబట్టి పౌరులందరూ తమను తాము నామినేట్ చేసుకోవడంతో పాటు ఇతరులను కూడా సిఫార్సు చేయవచ్చని తెలిపింది. సమాజంలో నిస్వార్థ సేవ చేస్తున్న మహిళలు, బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులు వంటి వారిని గుర్తించి నామినేట్ చేయాలని ప్రభుత్వం కోరింది. ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు సహా ప్రభుత్వ సేవకులు ఈ అవార్డులకు అర్హులు కారని, అయితే వైద్యులు, శాస్త్రవేత్తలకు దీని నుంచి మినహాయింపు ఉందని స్పష్టం చేసింది. 1954లో ప్రారంభమైన ఈ పురస్కారాలను ఏటా గణతంత్ర దినోత్సవం నాడు ప్రకటిస్తారు.

# బీజేపీలో ఆప్ ఎంపీల విలీనానికి రాజ్యసభ చైర్మన్ ఆమోదం

అభ్యర్థించారు. అయితే వారి విజ్ఞప్తిని రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదించారు.దీంతో ప్రస్తుతం రాజ్యసభ వెబ్‌సైట్‌లో ఆ ఏడుగురు ఎంపీల పేర్లు బీజేపీ సభ్యుల జాబితాలో కనిపిస్తున్నాయి. ఆ ఏడుగురు ఎంపీలలో రాఘవ్ చద్దా, అశోక్ మిట్టల్, హర్భజన్ సింగ్, సందీప్ పాఠక్, విక్రమ్‌జిత్ సాహ్నీ, స్వాతి మాలివాల్, రాజేందర్ గుప్తాలు ఉన్నారు. ప్రస్తుతం వారు రాజ్యసభలో బీజేపీ ఎంపీలుగానే కొనసాగనున్నారు.ఇదిలాఉంటే, పార్టీ ఫిరాయించిన ఆ ఏడుగురు ఎంపీల సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఆదివారం రాజ్యసభ చైర్మన్‌కు ఒక పిటిషన్‌ను సమర్పించింది. రాజ్యసభలో తమ పార్టీకి చెందిన ఏడుగురు ఎంపీలు ఇటీవల ఆప్‌ను వీడి బీజేపీలో విలీనమవుతున్నట్లు ప్రకటించారని, వారిని అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ తాను చైర్మన్ రాధాకృష్ణన్‌కు ఒక పిటిషన్ సమర్పించినట్లు ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ తెలిపారు. ఇదిలాఉంటే, తాము నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నామని ఎంపీ రాఘవ్ చద్దా తెలిపారు. "రాజ్యసభలోని ఆప్‌కు చెందిన మూడింట రెండు వంతుల మంది సభ్యులమైన మేము, భారత రాజ్యాంగ నిబంధనలను అనుసరించి బీజేపీలో విలీనమవ్వాలని నిర్ణయించుకున్నాము" అని రాఘవ్ చద్దా విలేకరుల సమావేశంలో పేర్కొన్న సంగతి తెలిసిందే.మరోవైపు ఆమ్ ఆద్మీ పార్టీని వీడి భారతీయ జనతా పార్టీలో విలీనమవ్వాలని నిర్ణయించుకున్న రాఘవ్ చద్దా, మరో ఆరుగురు ఎంపీలకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోమవారం స్వాగతం పలుకుతున్నట్టుగా పేర్కొన్నారు. రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఏడుగురు ఆప్ ఎంపీలు బీజేపీలో విలీనమవడాన్ని ఆమోదించారని తెలిపారు. ఇప్పుడు రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్, హర్భజన్ సింగ్, స్వాతి మాలివాల్, రాజిందర్ గుప్తా, విక్రమ్‌జిత్ సింగ్ సాహ్నీలు బీజేపీ పార్లమెంటరీ పార్టీలో సభ్యులుగా ఉన్నారని చెప్పారు. బీజేపీలో చేరిన ఏడుగురు ఎంపీల ప్రవర్తనను ప్రస్తావించారు. వారు ఎన్నడూ ఎలాంటి క్రమశిక్షణా రాహిత్యానికి గానీ, అసమంజస ప్రవర్తనకు గానీ పాల్పడలేదని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలోని దేశ నిర్మాణానికి కృషి చేస్తున్న ఎన్డీఏకు స్వాగతం తుక్డే-తుక్డే ఇండి అలయన్స్‌కు వీడ్కోలు అని కూడా కిరణ్ రిజుజు ఎక్స్‌లో చేసిన పోస్టులో పేర్కొన్నారు.

### రాజ్యసభలో పెరిగిన ఎన్డీయే బలం..

ఏడుగురు ఎంపీల విలీనంతో రాజ్యసభలో బీజేపీ బలం పెరిగింది. దీంతో ఎన్డీయే బలం 148కి చేరింది. రాజ్యసభలో ఎన్డీయే బలం బీజేపీ 113, టీడీపీ 2, జేడీ (యూ) 4, శివసేన 2, ఆర్ఎల్డీ 1, జేడీ(ఎస్) 1, ఏజీపీ 1, ఎన్సీపీ 4, ఏఐఏడీఎంకే 5, ఆర్‌పీఐ (అథవాలే) 1, రాష్ట్రీయ లోక్ మోర్చా (ఉపేంద్ర కుష్వాహా పార్టీ) 1, యునైటెడ్ పీపుల్స్ పార్టీ (లిబరల్) 2, స్వతంత్ర రాజ్యసభ ఎంపీ కార్తికేయ శర్మ, ఎంఎన్ఎఫ్ 1, ఎన్‌పీపీ 1, పీఎంకే 1 ఉన్నారు. బీజేపీలో చేరకపోయినప్పటికీ నామినేటెడ్ సభ్యుల మద్దతు కూడా సాధారణంగా అధికార పక్షానికే ఉంటుంది. ప్రస్తుతం రాజ్యసభలో ఏడుగురు నామినేటెడ్ సభ్యులు ఉన్నారు.

# బీఆర్ఎస్ ఒక శవం..ఎన్ని అలంకరణలు చేసినా వృథా

ఇదంతా కేవలం వారి కుటుంబ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు.

### కేసీఆర్ శత్రువు కాదు.. కేవలం రాజకీయ ప్రత్యర్థి మాత్రమే

చనిపోవాలని కోరుకుంటున్నట్లుగా కేసీఆర్ చేసిన విమర్శలను కూడా రేవంత్ రెడ్డి ఖండించారు. కేసీఆర్ నాకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమే, శత్రువు కాదు. ఆయన ఆరోగ్యం బాగుండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నది నేనే. ఆయన్ని స్వయంగా కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నాను అని గుర్తుచేశారు. ఆయనకు చెడు జరగాలని కోరుకోవాల్సిన అవసరం తనకు లేదని, ఇప్పటికే తాను విజయం సాధించి అధికారంలో ఉన్నానని చెప్పారు. అయితే, కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటారేమో అని రేవంత్ రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు.

### ముగిసిన బీఆర్ఎస్ అధ్యాయం

తెలంగాణ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా సాగిన బీఆర్ఎస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని సీఎం పేర్కొన్నారు. పదేళ్ల అహంకార పూరిత పాలనకు జనం చరమగీతం పాడారని, ఇప్పుడు ఆ పార్టీని బతికించేందుకు ఎంత ప్రయత్నం చేసినా లాభం లేదని విశ్లేషించారు. రాజకీయంగా తమ పని అయిపోయిందని తెలిసే, ఇప్పుడు మనుగడ కోసం రకరకాల వేషాలు వేస్తున్నారని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. మొత్తం మీద బీఆర్ఎస్ ఉనికి ప్రశ్నార్థకమైందని ఆయన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.

ఆ జడ్డి ముందు నేనస్సలే హాజరు కాను

ఇక్కడ కేసు విచారణ తటస్థంగా జరుగుతుందన్న నమ్మకం తనకు లేదని అందుకే ఆమె ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టులో సవాలు చేస్తానని స్పష్టం చేశారు. "గతంలో నన్ను అన్యాయంగా జైలుకు పంపారు. చివరికి సత్యమే గెలిచింది. కానీ ఈసారి విచారణ తీరుపై నాకు అనేక సందేహాలు ఉన్నాయి" అని కేజ్రీవాల్ తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు.


### న్యాయ పోరాటం నుంచి ప్రజా పోరాటం వైపు

కేజ్రీవాల్ తీసుకున్న ఈ నిర్ణయం న్యాయవ్యవస్థకు, ప్రభుత్వానికి మధ్య కొత్త యుద్ధానికి తెరలేపినట్లయింది. ఒక మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఉండి కోర్టు విచారణకు హాజరు కాబోనని చెప్పడం తీవ్రమైన పరిణామంగా న్యాయ నిపుణులు భావిస్తున్నారు. అయితే కేంద్రం దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని తనను వేధిస్తోందని, దీనిని ప్రజల వద్దే తేల్చుకుంటానని కేజ్రీవాల్ స్పష్టం చేశారు.

## ఘనంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు

# రామచంద్ర రావు జన్మదిన వేడుకలు

**- రాష్ట్రంలో రానున్నది బిజెపి ప్రభుత్వమే - జిల్లా బిజెపి అధ్యక్షుడు బైరెడ్డి**



**కొత్తగూడెం** లక్ష్మీదేవిపల్లి మండలంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిజెపి అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర బిజెపి రథసారథి రామచంద్రరావు తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కృషి చేస్తు నిరంతరం ప్రజాక్షేత్రంలోనే ఉంటూ, పార్టీ పటిష్టతకై అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. రాష్ట్రంలో పార్టీకి ఆదరణ పెరిగిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపికి వచ్చిన ఓటింగ్ శాతమే అందుకు నిదర్శనమన్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా రామచంద్రరావు బాధ్యతలు చేపట్టిన అనంతరం జరిగిన ఎన్నికల సందర్భంలో పార్టీకి పెరిగిన ఓటింగ్ శుభ పరిణామం అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రానున్న కాలంలో రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చే విధంగా సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాటోత్ వెంకన్న, బలగం శ్రీధర్, నరేంద్రబాబు, భూక్య రవినాయక్, సలీం, రాకేష్, మురళి, ఎల్.రమేష్, బాలరాజు, రవీందర్, సుధాకర్, హైట్ శ్రీనివాస్, నవీన్, మహిళా నాయకురాలు సముద్రాల గాయత్రి, కవిత, కళావతి బిజెపి పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అట్టహాసంగా ఏయూ శతాబ్ది

# ఉత్సవాల ముగింపు వేడుక

ఏడాది ఏప్రిల్ 26 నుంచి ఈ వేడుకు ప్రారంభమయ్యాయి. ఈ ప్రధాన వేడుకలో పాల్గొనేందుకు దాదాపు పాతిక వేల మంది విద్యార్థులు, దేశ విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు, ప్రొఫెసర్లు, సిబ్బంది హాజరయ్యారు.ఈ చారిత్రక ఘట్టానికి భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా వచ్చారు. భారత రత్న, క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ గౌరవ అతిథిగా హాజరై విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ వేడుకలో పాల్గొని యూనివర్శిటీ అభివృద్ధికి దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్, ఏయూను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని సంకల్పాన్ని చాటారు. వీరితోపాటు గవర్నర్ అబ్దుల్ నజీర్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.విశాఖలో ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ 15 బిలియన్ యూఎస్ డాలర్ల పెట్టుబడితో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోతోందని, ఇది ఆర్థిక సంస్కరణల తర్వాత అతి పెద్ద పెట్టుబడి అని పేర్కొన్నారు. ఇకపై విశాఖ గ్లోబస్ సిటీ అని ప్రకటించారు. ఇలాంటి సందర్భంలోనే ఏయూ వందేళ్ల పండగ చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఆంధ్ర యూనివర్శిటీని గ్లోబల్ యూనివర్శిటీగా మార్చేందుకు ఒక సమగ్రమైన మాస్టర్ ప్లాన్ రెడీ చేస్తున్నట్టు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. రాబోయే 20 ఏళ్లలో ఈ యూనివర్శిటీ అంతర్జాతీయ ప్రమాణాలతో ఎలా ఎదగాలనే దానిపై వచ్చే ఏడాది కాలంలోనే ప్రణాళికలు తీసుకురానున్నట్టు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ వెల్లడించారు. ఇది కేవలం ముగింపు కాదని, సరికొత్త ప్రారంభమని అన్నారు.సచిన్ టెండూల్కర్ మాట్లాడుతూ సమాజంలో విలువలతో కూడిన ప్రవర్తన అత్యంత ముఖ్యమని అన్నారు. ఇది తర్వాత తరానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. తనపై విద్యార్థులు చూపిన అపారమైన ప్రేమను జీవితాంతం గుర్తుంచుకుంటానని భావోద్వేగానికి గురయ్యారు. తన తండ్రి కూడా చాలా కష్టపడి చదువుకొని పైకి వచ్చారని పేర్కొన్నారు. తను పుట్టేసరికి తాము రెండు గదుల ఇంటిలోనే ఉండేవారమని, ఆ ఇంట్లో కూడా ఓ చివర తన తండ్రి శ్రద్ధగా చదువుకొని గోల్డ్ మెడల్ సాధించిన విషయం తనకు ఇంకా గుర్తు ఉందని పేర్కొన్నారు. మనం ఎక్కడ ఉన్నా సరే మన ఫోకస్ మాత్రం మిస్ కాకూడదని చెప్పారు. ఏకాగ్రత ముఖ్యమని చెప్పారు.ప్రముఖ దర్శకుడు, పూర్వ విద్యార్థి త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ యూనిటవర్శిటీ అంటే డైవర్సిటీ, యూనిజాన్ కలిసే చోటు అని అన్నారు. విద్య అంటే కనబడని దాన్ని నేర్పడం కాదు, మన ఎదురుగా ఉన్న దాన్ని మనం చూడని దృక్కోణంలో చూడటం నేర్పడమని ఆయన ఫిజిక్స్ సూత్రాలను ఉదాహరణగా చెప్తూ వివరించారు. కలవడం మూలంగానే గెలుస్తామని చెప్పుకొచ్చారు. తాను ఏయూ లైబ్రరీలో చదివిన సాహిత్యమే తన నేటి విజయానికి ఆయుధమని గుర్తు చేశారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు కూడా తమకు నచ్చిన రంగంలో తమకు నచ్చిన ఆయుధాలను సిద్ధం చేసుకునేలా చదలవాలని సూచించారు. రాబోయే కాలంలో ఏయూ ప్రపంచ విద్యారంగంలో అగ్రస్థానంలో ఉంటుందన్నారు. శతాయుష్మాన్ భవ ఆంధ్ర యూనివర్శిటీ అని దీవించారు.

# చాలా పార్టీలు వస్తూంటాయి, పోతూంటాయి

విభేదాలు ఉన్నట్లు కాదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఒక ప్రజాస్వామ్య పార్టీ అని, నాయకుల మధ్య ఎలాంటి మనస్పర్థలు లేవని చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో పార్టీని మళ్ళీ గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, త్వరలోనే కొత్త కమిటీల నియామకం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పాటును అవమానిస్తూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. పార్లమెంట్‌లో ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని తాను వ్యక్తిగతంగా ఫోన్ చేసి హెచ్చరించినట్లు కేటీఆర్ వెల్లడించారు. తెలంగాణ అస్థిత్వాన్ని కించపరిస్తే చూస్తూ ఊరుకోం.. ఆయన తన వ్యాఖ్యలకు వివరణ ఇచ్చుకున్నప్పటికీ, బేషరతుగా క్షమాపణ చెప్పాల్సిందే అని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్ అంశంపై చర్చ జరుగుతున్నప్పుడు రాష్ట్ర ప్రయోజనాల కోసం అందరూ ఏకమవ్వాలని పిలుపునిచ్చారు.రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ నిలదీశారు. గత బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా, చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ధాన్యం సేకరణలో జాప్యం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో తెరిచి, రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించాలని అల్టిమేటం జారీ చేశారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో జాప్యం జరిగితే గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. రైతుల పక్షాన పోరాడటమే తమ పార్టీ మొదటి ప్రాధాన్యత అని కాంగ్రెస్ తన ఎన్నికల హామీలను నిలబెట్టుకోవడంలో వైఫల్యం చెందిందని ఆయన విమర్శించారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరడం రిస్కీ పని

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) మీ జీవితంలో మీరు చేసిన అత్యంత రిస్కీ పని ఏమిటి? అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్నించగా, ఓ విద్యార్థిని నుంచి ఊహించని సమాధానం వచ్చింది. దీనితో అక్కడ కొన్ని క్షణాలు నవ్వులు విరబూశాయి. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఢిల్లీ యూనివర్సిటీ, గార్గీ కాలేజీలకు చెందిన విద్యార్థినులతో రాహుల్ గాంధీ ముచ్చటించారు. ఆ సమయంలో "మీరు చేసిన అత్యంత సాహసోపేతమైన పని ఏమిటి?" అని విద్యార్థినులను రాహుల్ గాంధీ ప్రశ్నించారు. అక్కడున్న వారిలో ఒక విద్యార్థిని స్పందిస్తూ, కాంగ్రెస్ పార్టీలో చేరడం అత్యంత సాహసోపేతమైనదని పేర్కొన్నారు. ఈ సమాధానంతో రాహుల్ గాంధీ కూడా నవ్వేశారు. "అవును, అది నిజంగా సాహసోపేతమైనదే" అంటూ బదులిచ్చారు. దీంతో రాహుల్ గాంధీతో పాటు విద్యార్థినులందరూ సరదాగా నవ్వారు. రాహుల్ గాంధీ యువ ఓటర్లతో మమేకవ్వడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో కాలేజీ విద్యార్థినులతో జరిగిన కార్యక్రమంలో ఈ సరదా సంభాషణ జరిగింది.

## ఇంధన కొరత ఏర్పడినందుకు

# చంద్రబాబు సిగ్గుపడాలి

**- కూటమి ప్రభుత్వ పాలనా వైఫల్యమని ఆరోపణ**

అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్రంగా స్పందించారు. కేవలం సమీక్షలు, సలహాలతో ఇంధన కొరత తీరదని, 24 గంటల డెడ్ లైన్‌తో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 70 శాతం బంకులు మూతపడటం అత్యంత దారుణమని, దీనిని అత్యవసర పరిస్థితిగా గుర్తించి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. "దేశంలో ఎక్కడా లేని ఇంధన కొరత ఏపీలోనే ఏర్పడినందుకు చంద్రబాబు సిగ్గుపడాలి. ప్రజలను ఎర్రటి ఎండలో కిలోమీటర్ల మేర నిలబెట్టడం కూటమి పాలనా వైఫల్యానికి నిదర్శనం" అని షర్మిల మండిపడ్డారు. మోదీకి మద్దతు ఇచ్చి ప్రధాని పీఠంపై కూర్చోబెట్టినా రాష్ట్రానికి ఇంధన కష్టాలు రావడం బాధాకరమన్నారు. ఇంధన కొరత వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే ప్రమాదం ఉందని, ప్రభుత్వం వెంటనే నిద్రమత్తు వీడాలని హెచ్చరించారు.

## ప్రజావాణి కార్యక్రమంలో సమస్యల

# పరిష్కారంపై జిల్లా ఎస్పీ డి.జానకి, దృష్టి



**మహబూబ్ నగర్** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీ డి.జానకి, రు పోలీస్ ప్రధాన కార్యాలయం ఛాంబర్‌లో స్వయంగా స్వీకరించి ప్రతి దరఖాస్తును పరిశీలించారు.

ఈ సందర్భంగా భూమి వివాదాలు, కుటుంబ సమస్యలు, సైబర్ మోసాలు, మహిళల భద్రత, మరియు ఇతర ప్రజా సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను వివరంగా తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రతి ఫిర్యాదుదారునికి న్యాయం జరిగేలా పారదర్శకంగా విచారణ చేపట్టాలని, సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. జిల్లా ప్రజలకు ప్రజావాణి ఒక ఉత్తమ వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొంటూ, ఎవరైనా తమ సమస్యలను నేరుగా పోలీసు అధికారులకు తెలియజేయవచ్చని ఎస్పీ గారు తెలిపారు. అదేవిధంగా, ఫిర్యాదులు సమర్పించిన ప్రతి వ్యక్తికి సరైన స్పందన ఇవ్వడం పోలీస్ శాఖ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం ద్వారా పోలీసులపై విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులను ఉద్దేశించి, ప్రతి ఫిర్యాదును బాధ్యత గా తీసుకుని, సమయపాలనతో పరిష్కరించాలని ఆదేశించారు.

# టెక్నాలజీతో నాణ్యమైన వైద్యసేవలు

గన్ని భాస్కరరావు సీఎంకు వివరించారు. నెల్లూరులోని నారాయణ హాస్పిటల్‌లో ఉన్న రోగికి రాజమండ్రి జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యులు రోబో ద్వారా సర్జరీ చేశానని అలాగే జీఎస్ఎల్‌లో ఉన్న రోగికి నారాయణ ఆసుపత్రి వైద్యులు దూరం నుంచే శస్త్రచికిత్స నిర్వహించారని తెలిపారు. దేశంలోనే తొలిసారి ఈ తరహా సర్జరీ నిర్వహించినట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా రెండు ఆసుపత్రుల యజమాన్యాలను చంద్రబాబు అభినందించారు. టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటే దూరంగా ఉన్నా సరే నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చని ఈ సంస్థలు నిరూపించాయని సీఎం అన్నారు. రెండు రోజుల వ్యవధిలో నాలుగు సర్జరీలను విజయవంతంగా పూర్తి చేయడం విశేషమన్నారు. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న రోగులకు కూడా ఆయా రంగాల్లో నైపుణ్యం సాధించిన డాక్టర్లు ఎక్కడి నుంచైనా సర్జరీ చేయగలిగే ఈ సాంకేతికత భవిష్యత్తులో వైద్య సేవల రూపురేఖలను పూర్తిగా మార్చేస్తుందని సీఎం పేర్కొన్నారు.

# కాంగ్రెస్, బీజేపీ ఎంపీలకు తెలంగాణ పౌరుషం లేదా.?

ధ్వజమెత్తారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తున్నారని, తాము అధికారంలోకి రాగానే మొదటి సంతకం ఈ వ్యవస్థను రద్దు చేయడంపైనే పెడతానని హామీ ఇచ్చారు. చిల్లర మాటలు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, మంత్రుల తీరు చూస్తుంటే జాలి వేస్తోందని ఆయన ఎద్దేవా చేశారు.

### పార్టీ యంత్రాంగం సంపూర్ణ ప్రక్షాళన

పార్టీలో కొత్త రక్తం ఎక్కించేందుకు కేసీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ కమిటీ మినహా, ప్రస్తుతం ఉన్న అన్ని జిల్లా, గ్రామ, మండల, పట్టణ కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కేవలం పని చేసే వారికే ప్రాధాన్యత ఉంటుందని, వెంటనే కొత్త కమిటీల నియామకం మరియు సభ్యత్వ నమోదు చేపట్టాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే సీనియర్ నేత టి. జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తూ, ఆయనను బీఆర్ఎస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా నియమిస్తున్నట్లు ప్రకటించి సమావేశానికి పరిచయం చేశారు.

### రైతు కష్టాలపై ఆవేదన

రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు అస్తవ్యస్తంగా మారడంపై కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేతకానితనం వల్ల రైతన్నలు రోడ్ల మీద ఇబ్బందులు పడుతున్నారని, ఇది చూస్తుంటే తీవ్ర బాధ కలుగుతోందని అన్నారు. గతంలో తాము 24 గంటల విద్యుత్, రైతుబంధు వంటి పథకాలతో సాగును పండుగ చేస్తే, నేడు కాంగ్రెస్ సర్కార్ వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టేందుకు సిద్ధమవుతోందని ఆరోపించారు. ప్రజల పక్షాన పోరాడేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

### కేటీఆర్‌కు కీలక బాధ్యతలు.. పునర్నిర్మాణమే లక్ష్యం

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే కీలక బాధ్యతలను కేసీఆర్ అప్పగించారు. ప్రతి నియోజకవర్గంలో కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించాలని, తెలంగాణ పునర్నిర్మాణం కోసం ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు.

# ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్ ప్రమాణం

మంత్రి అజారుద్దీన్ మీడియాతో మాట్లాడారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి, సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రిమండలికి, టీపీసీసీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, వారి అభివృద్ధి కోసం తాను మరింత నిబద్ధతతో కృషి చేస్తానన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా, మైనార్టీల సంక్షేమంపై ముఖ్యమంత్రికి ఉన్న చిత్తశుద్ధి వల్లే తనకు ఈ అవకాశం లభించిందని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే ఎత్తుపల్లాలను అధిగమిస్తూ ప్రజాసేవలో ముందుంటానని ఈ సందర్భంగా అజారుద్దీన్ స్పష్టం చేశారు.

### ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానో కోదండరాం

ప్రమాణ స్వీకారం చేసిన తరువాత కోదండరాం మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిలో తాను భాగమై, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానన్నారు. తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి, పీసీసీకి ధన్యవాదాలు తెలిపారు.

### అజారుద్దీన్ మంత్రి పదవి సేఫ్..

తెలంగాణ రాజకీయాల్లో గత కొంతకాలంగా నెలకొన్న సందిగ్ధతకు ఎట్టకేలకు తెరపడింది. గవర్నర్ కోటా కింద పెండింగ్‌లో ఉన్న 2 ఎమ్మెల్సీ పదవుల నియామక ఫైల్‌పై గవర్నర్ శివ్‌ప్రతాప్ సంతకం చేయడంతో మంత్రి అజారుద్దీన్ పదవీ గండం నుంచి గట్టెక్కారు. గత ఏడాది ఆగస్టు 30న ప్రొఫెసర్ కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా నియమించాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం పంపిన ప్రతిపాదన అప్పటి నుండి రాజ్‌భవన్‌లో పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే.ఈ పరిణామం మంత్రి అజారుద్దీన్‌కు అత్యంత కీలకంగా మారింది. శాసనసభ లేదా శాసనమండలిలో సభ్యత్వం లేకుండానే ఆయనను రాష్ట్ర ప్రభుత్వం మంత్రిగా ప్రమాణం చేయించింది. నిబంధనల ప్రకారం 6 నెలల గడువులోగా ఏదైనా సభలో సభ్యుడిగా ఎన్నికవ్వాల్సి ఉండగా, ఆ గడువు ముగిసే సరిగ్గా కొన్ని రోజుల ముందు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులకు ఆమోదం తెలపడం ప్రాధాన్యత సంతరించుకుంది. గవర్నర్ నిర్ణయంతో అటు ప్రభుత్వం, ఇటు అజారుద్దీన్ కు ఊరట లభించింది. దీంతో ఆయన మంత్రి పదవికి ఎదురైన సాంకేతిక అడ్డంకులు తొలగిపోయాయి.

# మహిళా, పిల్లల రక్షణకు "స్పందన"

ప్రారంభించింది. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ స్పందన టీంలను రూపొందించగా వాటిని బంజారాహిల్స్ టీజీ ఐసీసీసీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి వీటిని లాంఛనంగా ప్రారంభించారు.ఈ స్పందన టీంలు ఆపద సమయంలో క్షణాల్లో ఘటనాస్థలానికి చేరుకుని ప్రజలకు తక్షణ రక్షణ కల్పించనున్నాయి.

### ఆపద ఏదైనా ఫిర్యాదు చేసేందుకు వెనుకాడ వద్దు

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో స్పందన టీంలను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. చిన్నారులు, మహిళల రక్షణ కోసం ఈ స్పందన టీంలను ఏర్పాటు చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు నగరంలో మహిళలు భయం లేకుండా తిరిగే వాతావరణం ఉండాలని చెప్పుకొచ్చారు.'మహిళల భద్రతే స్పందన టీమ్‌ల ప్రధాన ధ్యేయం. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేలా వీటిని ఏర్పాటు చేశాం. ఏ చిన్న ఆపద వచ్చినా ఫిర్యాదు చేయడానికి వెనుకాడొద్దు'అని చిన్నారులు, మహిళలకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

### మహిళల భద్రత కోసమే స్పందన టీంలు

నగర పోలీసింగ్ వ్యవస్థలో ఈ 'స్పందన' టీమ్‌లు ఒక కీలక మార్పుగా నిలుస్తాయని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. తక్షణ రక్షణ పేరుతో స్పందన సభ్యులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఒక్కో ఏసీపీ జోన్‌కు రెండు స్పందన టీంలు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. డయల్ 100/112లతో స్పందన టీంల అనుసంధానిస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదులపై ఆలస్యం లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు ఈ స్పందన టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళల భద్రత కోసమే స్పందన టీంలను ఏర్పాటు చేశామని... ఆపదలో ఉన్న చిన్నారులు, మహిళలకు తక్షణ సాయం అందించడంలో ఈ టీంలు సహకరిస్తాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

### పోలీస్ కమిషనరేట్ పరిధిలో కీలక మార్పు

మరోవైపు ఈ స్పందన టీంలు భాగ్యనగరం పోలీస్ కమిషనరేట్ పరిధిలో కీలక మార్పుగా నిలుస్తాయని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఆపదలో ఉన్న చిన్నారులు లేదా మహిళలు, బాధితులు ఎవరు అయినా డయల్ 100 లేదా 112 నంబర్లకు కాల్ చేసిన వెంటనే స్పందన టీం అక్కడకు క్షణాల్లో చేరుతుంది అని పోలీసులు చెప్తున్నారు. తద్వారా నిమిషాల వ్యవధిలోనే పోలీసులు బాధితుల వద్దకు చేరుకురి వారికి అండగా నిలుస్తారని అన్నారు.ఈ స్పందన టీం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, డీజీపీ బి. శివధర్ రెడ్డి, హైదరాబాద్ నగర సీపీ వి.సి. సజ్జనార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మే 4న బెంగాల్‌లో మిఠాయిలు పంచుతాం

మోదీ అన్నారు. ఈ రోడ్డు షోలే తనకు పుణ్యయాత్రలని వ్యాఖ్యానించారు. నాడు టీఎంసీ అధికారంలోకి రావడానికి కారణమైన 'మా-మాటి-మనుష్' నినాదాన్ని వారు వదిలివేశారని ఆరోపించారు. ఎన్నికల ప్రచారం సమయంలో వారు ఒక్కసారి కూడా ఈ నినాదాన్ని ప్రస్తావించకపోవడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు.

ఆ పార్టీ నేతలు రాష్ట్రాభివృద్ధిని పక్కన పెట్టి దూషణలు, బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. టీఎంసీ పాలనలో మహిళలపై గతంలో ఎన్నడూ లేనివిధంగా దాడులు జరిగాయని మండిపడ్డారు. నేరస్థులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే నిందితులను వదిలిపెట్టేది లేదని ప్రధాని మోదీ అన్నారు.

# శతాబ్దికాలంగా ఆకలి తీర్చుతున్న సాధు అన్న సత్రం

**- ఆరాధన ఉత్సవాలలో సాధు అన్న సత్రం నందు భక్తులకు అన్నదానం**

**- ధర్మకర్త బొమ్ము వీరభద్రారెడ్డి**

**బ్రహ్మంగారిమఠం** బ్రహ్మంగారి 333వ ఆరాధన గురుపూజోత్సవ ఉత్సవాలలో భాగంగా ఆదివారం నుండి మూడు రోజులపాటు సాధు అన్న సత్రం నందు కులమతాలకు అతీతంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తాదులకు కాదు అన్న సత్రం వంశపారంపర్య ధర్మకర్త బొమ్ము వీరభద్రారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం విరివిగా కొనసాగుతుంది. బ్రహ్మంగారిమఠంలో కులమతాలకతీతంగా ఆరాధనకు వచ్చే భక్తులందరి ఆకలి తీర్చేందుకు తొట్ట తొలుత ప్రారంభించిన సత్రం సాదు అన్న సత్రం. ఇది నాటినుండి నేటి వరకు పరంపరగానే కొనసాగుతున్న అన్నవితరణ వంద సంవత్సరాలు పూర్తయిన మారని సంకల్ప బలం, బ్రహ్మంగారి ఆరాధన భక్తులకు అన్న వసతి తో పాటుగా వేలాదిమంది విద్యార్థులకు విద్యావసతుల నిలయంగా పేరుపడిన సత్రం సాదు అన్న సత్రం.ఇది ప్రస్తుతము బ్రహ్మంగారి క్షేత్రంలో పదుల సంఖ్యలో కులాల పేరుతో అన్న సత్రాలు నిర్వహిస్తున్నప్పటికీ తన ప్రత్యేకతను మాత్రం నిలబెట్టుకుంటున్న సత్రం సాధు అన్న సత్రం.ఈ సత్రం కడప జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో బ్రహ్మంగారి ఆరాధన సమయంలో పెద్ద సంఖ్యలో సాధువులు బ్రహ్మంగారి ఉత్సవాల చూచేందుకు విపరీతంగా తరలి వచ్చేవారు. 100 సంవత్సరాల క్రితం వారికి ఎలాంటి భోజన సదుపాయాలు లేక తీవ్ర ఇక్కట్లకు గురి అయ్యేవారు.

అలాంటి సమయంలో, వారి ఆకలి బాధలను తీర్చాలన్న సదుద్దేశంతో, కులమతాలకు అతీతంగా, కొందరు పెద్దలు తో పాటు బొమ్ము వారి కుటుంబీకులు కలసి సాధువు అన్న సత్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. దీనికి బొమ్ము పెద్ద వీరారెడ్డితో అప్పటి పెద్దలు పూజ్యులు చాటకొండు సుబ్బయ్య, వంకర వీరయ్య గారు సహకారాన్ని అందించారు. సోమిరెడ్డి పల్లె సర్వే నెంబరు 332 /2 లో సుమారు 30 సెంట్ల విస్తీర్ణంలో ఒక సత్రాన్ని నిర్మించడం జరిగింది. ఆ సత్రంలో వంద సంవత్సరాల క్రితం నుండి బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాలలో బ్రహ్మంగారు జీవ సమాధి చెందిన వైశాఖ శుద్ధ దశమి రోజు, బ్రహ్మంగారి రథోత్సవం రోజు, మరియు మహా నివేదన రోజు కలిసి మూడు రోజులపాటు భక్తాదులందరికీ అన్న వసతులు కల్పిస్తున్నారు. బ్రహ్మంగారిమఠంలో తొట్ట తొలుత కులమతాలకు అతీతంగా బ్రహ్మంగారిఆరాధన సమయంలో ఎక్కువగా వచ్చే సాధువులతో పాటుగా అందరికీ కూడా అన్నవితరణ చేసిన సత్రంగా ఖ్యాతి చెందింది. అంతేకాకుండా మిగిలిన దినాలలో ఈ సత్రం ఖాళీగా ఉండకుండా వేలాదిమంది విద్యార్థులకు విద్యాభ్యాసం చేసేందుకు, అప్పుడు ఎలాంటి వసతి లేని జిల్లా పరిషత్ హై స్కూలు, తదుపరి వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల, హాస్టల్ నిర్వహణకు కూడా సహకరిస్తూ, ఎంతోమంది విద్యార్థులను ఉన్నతాధికారులుగాను, రాజకీయ నాయకుల గాను,, కవులు రచయితలుగా, కళాకారులుగా తీర్చిదిద్దేందుకు, సహాయపడిందని చెప్పవచ్చు. ఇప్పటికీ వంద సంవత్సరాలు గడుస్తున్నా కూడా చెక్కుచెదరకుండా నిలిచింది. ప్రస్తుతం బ్రహ్మంగారి క్షేత్రంలో పదుల సంఖ్యలో అన్నికులాల పేరుతో, అన్న సత్రాలు నిర్వహిస్తున్నప్పటికీ, తన ప్రత్యేకతను మాత్రం ఇప్పటికీ నిలబెట్టుకుంటున్న సత్రం

## మే నెలలో తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయం, అనుబంధ ఆలయాలలో విశేష ఉత్సవాలు

**- మే 1, 15, 22, 29వ తేదీలలో శుక్రవారం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు తిరుచ్చి ఉత్సవం**

మే 1న వసంతోత్సవాలలో భాగంగా ఉదయం 9.30 గంటలకు అమ్మవారి స్వర్ణ రథం.- మే 2వ తేదీ అమ్మవారి ఆలయంలో వసంతోత్సవాలు ముగుస్తాయి.- మే 8న ఉత్తరాషాఢ నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6.45 గంటలకు ఆలయ మాడ వీధులలో గజ వాహనంపై అమ్మవారు విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు.శ్రీ సుందరరాజ స్వామి ఆలయంలో..- మే 13న ఉత్తర భద్ర నక్షత్రం సందర్భంగా రాత్రి 7 గంటలకు స్వామివారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధులలో విహరించి అనుగ్రహించనున్నారు. శ్రీ బలరామకృష్ణ స్వామి ఆలయంలో..- మే 18వ తేదీ రోహిణి నక్షత్రం సందర్భంగా శ్రీ కృష్ణ స్వామివారికి రాత్రి 7 గంటలకు తిరుచ్చి ఉత్సవం జరుగనుంది.శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో..- మే 27న హస్త నక్షత్రం సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామివారికి సాయంత్రం 5 గంటలకు తిరుచ్చి ఉత్సవం నిర్వహించనున్నారు.శ్రీ శ్రీనివాస స్వామి ఆలయంలో..- మే 2, 9, 16, 23, 30వ తేదీలలో శ్రీనివాస స్వామి మూలవర్లకు ఉదయం 8 గంటలకు అభిషేకం.అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో....- మే 1, 8, 15, 22, 29వ తేదీలలో శుక్రవారం సందర్భంగా ఉదయం 7 గంటలకు వస్త్రాలంకరణ సేవ, అభిషేకం.- మే 5న ఉదయం 8 గంటలకు అష్టదళ పాదపద్మారాధన సేవ.- మే 9న శ్రవణ నక్షత్రం సందర్భంగా ఉదయం 10.30. గంటలకు కల్యాణోత్సవం.- మే 13న ఉదయం 8 గంటలకు అష్టోత్తరశత కలశాభిషేకం.- మే 3, 10, 17, 24, 31వ తేదీలలో శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారికి ఉదయం 8.15 గంటలకు అభిషేకం.

## శ్రీ చైతన్య కాలేజీలో భారీ దొంగతనం..

**- పాత నేరస్తుడు బొద్దుల యుగేందర్ అరెస్ట్:**

**- కరీంనగర్ సీపీ గౌష్ ఆలం**

**కరీంనగర్** జల్సాలకు అలవాటు పడి, కష్టం లేకుండా డబ్బు సంపాదించాలనే దుర్బుద్ధితో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఒక పాత నేరస్తుడిని కరీంనగర్ టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుండి దొంగిలించిన రూ. 5 లక్షల నగదు మరియు సుమారు 10 గ్రాముల బంగారు గొలుసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.?కేసు వివరాలు:?కరీంనగర్ టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె. సృజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..దుర్శేడ్ గ్రామానికి చెందిన బొద్దుల యుగేందర్ అనే వ్యక్తి గతంలోనూ పలు దొంగతనాల కేసుల్లో నిందితుడిగా ఉండి, పీడీ యాక్ట్ కింద జైలు శిక్ష అనుభవించాడు. జైలు నుండి వచ్చిన తర్వాత కూడా తన ప్రవర్తన మారని యుగేందర్, ఈ నెల 26 న మంకమ్మతోటలోని శ్రీ చైతన్య కాలేజీ ఆఫీసు తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించాడు.?బీరువాలో దాచి ఉంచిన రూ. 5 లక్షల నగదును, ఒక బంగారు చైన్ను దొంగిలించి తన ఇంటి వెనుక ఉన్న కట్టెల కుప్పలో దాచిపెట్టాడు. నమ్మదగిన సమాచారం మేరకు ఇన్స్పెక్టర్ సృజన్ రెడ్డి నేతృత్వంలోని బృందం నిందితుడిని దుర్శేడ్ లోని అతని నివాసం వద్ద అదుపులోకి తీసుకున్నారు.స్వాధీనం చేసుకున్న **ఆస్తి:**నిందితుడు చూపిన గుర్తింపు మేరకు పంచుల సమక్షంలో కింది సొత్తును స్వాధీనం చేసుకున్నారు:?రూ. 5,00,000 ఐదు లక్షల రూపాయలు?బంగారం: 10 గ్రాముల బంగారు చైన్.?పోలీసుల హెచ్చరిక,?నిందితుడు గతంలోనే చింతకుంట ఆంజనేయస్వామి గుడిలో హుండీ దొంగతనానికి పాల్పడినట్లు విచారణలో అంగీకరించాడు. నేర ప్రవృత్తి గల వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంటుందని, దొంగతనాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ హెచ్చరించారు.?సకాలంలో నిందితుడిని పట్టుకుని సొత్తును రికవరీ చేసిన పోలీసు బృందాన్ని కరీంనగర్ సీపీ గౌష్ ఆలం అభినందించారు.

## ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్ డీజిల్ సంక్షోభం!

**- పెట్రోల్ బంకుల వద్ద భారీ క్యూలు! - దర్శనమిస్తున్న నో స్టాక్ బోర్డులు.**

రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రమైంది. ప్రధాన పట్టణాల్లో బంకుల వద్ద కిలోమీటర్ల మేర క్యూలైన్లు కనిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్‌లో రాత్రికి రాత్రే పెట్రోల్ డీజిల్ దొరకడం లేదని వార్త గుప్పుమనడంతో వాహనదారులు బంకుల వద్దకు పరుగులు పెట్టారు. ఫిల్లింగ్ స్టేషన్స్ వద్ద కిలోమీటర్ల మేర క్యూలైన్లు కనిపిస్తున్నాయి. భారీ వాహనదారులు రావడంతో చాలా బంకుల నిర్వాహకులు నో స్టాక్ బోర్డులు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని ఉమ్మడి గోదావరి జిల్లాలు, కర్నూలు, నంద్యాల, కృష్ణా వంటి జిల్లాల్లో చమురు కొరత దారుణంగా ఉందనే ప్రచారం జోరుగా సాగుతోంది. కర్నూలు జిల్లాలో పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు గంటల తరబడి క్యూలైన్లలో ఎదురు చూస్తున్నారు. డీజిల్ దొరకదనే భయంతో పెట్రోల్ కోసం కూడా జనం ఎగబడుతున్నారు. చేతిలో ఖాళీ బాటిళ్లు, టిన్‌లు పట్టుకొని ఇంధనం కోసం బారులు తీరుతున్నారు. ఇది కర్నూలు జిల్లాలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి పరిస్థితి కనిపిస్తోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ప్రధాన పట్టణాలైన విజయవాడ, మచిలీపట్నంలో దాదాపు అన్ని బంకుల్లో డీజిల్ నిల్వలు లేవనే పరిస్థితి కనిపిస్తోంది. విజయవాడలో దాదాపు 75% బ్యాంకుల్లో నో స్థాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. కొన్ని బంకుల్లో మాత్రమే కొద్దిపాటి నిల్వలు ఉండటంతో వాహనదారులకు రేషన్ పద్ధతిలలో ఇంధనాన్ని సరఫరా చేస్తున్నారు. ఒక్కో వాహనాన్నికి 500 రూపాయలకు మించి డీజిల్ కొట్టడం లేదు. నందిగామలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడ కూడా కారుకు పది లీటర్లు, లారీకి 50 లీటర్లు మాత్రమే ఇంధనాన్ని ఫిల్ చేస్తున్నారు. ఆటో డ్రైవర్లు రెండు లీటర్ల డీజిల్ కోసమే గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. దీనిపై స్పందించిన ప్రభుత్వం రాష్ట్రంలో చమురు కొరత లేదని, ప్రజలు కంగారు పడొద్దని సూచించింది. దీని వల్ల ఉన్న స్టాక్ త్వరగా అయిపోతుందని అవసరమైన వాళ్లకు అందకుండా పోతుందని తెలిపారు. అవసరానికి మించి చమురు స్టాక్ పెట్టుకోవద్దని హితవు పలికింది.

## ఇంధన పరిమితులపై స్పష్టత లేక రాజవొమ్మంగిలో ఇబ్బందులు

**- 30 శాతం నిబంధన అమలు విధానం తెలియక వాహనదారుల ఆందోళన**



**రాజవొమ్మంగి, ఏప్రిల్ 27:** మండల కేంద్రంలో ఇంధన సరఫరాపై స్పష్టత లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెట్రోల్ కొరతతో ఇప్పటికే సమస్యలు తలెత్తగా, డీజిల్ సరఫరాలో అమలు చేస్తున్న 30 శాతం నిబంధనపై వివరాలు తెలియక గందరగోళం నెలకొంది.జిల్లా యంత్రాంగం ప్రతి వాహనానికి 30 శాతం మేర మాత్రమే డీజిల్ ఇవ్వాలని సూచించినప్పటికీ, అది ట్యాంకు సామర్థ్యానికి అనుగుణంగా ఎలా లెక్కించాలి, చిన్న వాహనాలకు ఎంత, పెద్ద వాహనాలకు ఎంత అనే విషయంపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వలేదు. దీంతో బంకుల వద్ద ఒక్కోచోట ఒక్కో విధంగా డీజిల్ సరఫరా జరుగుతోంది.కొన్ని బంకుల్లో చిన్న వాహనాలకు నిర్దిష్టంగా వెయ్యి రూపాయల వరకు, పెద్ద వాహనాలకు రెండు వేల నుంచి రెండువేల ఐదు వందల రూపాయల వరకు మాత్రమే డీజిల్ అందిస్తున్నారు. అయితే ఇది 30 శాతం నిబంధనకు ఎలా సరిపోతుందనే విషయంపై స్పష్టత లేకపోవడంతో వాహనదారుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ప్రత్యేకంగా భారీ వాహనాల యజమానులు ఈ పరిమితి సరిపోదని అంటున్నారు. ప్రయాణమధ్యలోనే వాహనాలు ఆగిపోతే సరుకు రవాణా దెబ్బతింటుందని వారు చెబు తున్నారు. ఈ సమయంలో మండలంలో జీడి, మామిడి పంటల రవాణా ప్రారంభమవుతున్నందున ఇంధన సమస్య మరింత ప్రభావం చూపుతోంది.ఇదిలా ఉండగా, వ్యవసాయ పనుల్లో వినియోగించే ట్రాక్టర్ల యజమానులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొలాల నుంచి రాజవొమ్మంగి మండల కేంద్రంలోని బంకుకు రావాలంటే చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు పది కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని వారు చెబుతున్నారు. ఒక లీటర్ డీజిల్‌తో సుమారు ఏడు కిలోమీటర్లు మాత్రమే ప్రయాణం సాధ్యమవుతుండగా, బంకుల వద్ద పది లీటర్ల పరిమితి విధించడం వల్ల తిరిగి పొలాలకు చేరుకోవడమే కష్టంగా మారుతోందని ఒక రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ఉంటే వ్యవసాయ పనులు ఎలా నిర్వహించాలనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.ఇదిలా ఉండగా, మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్‌లో నిన్నటి నుంచి పెట్రోల్ అందుబాటులో లేకపోవడంతో టూ వీలర్ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెట్రోల్ కోసం సుమారు 15 కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. దీంతో సమయం, ఖర్చు రెండూ పెరుగుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు.ఇప్పటికైనా 30 శాతం నిబంధన అమలు విధానం పై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వడంతో పాటు, వ్యవసాయ రంగ అవసరాలను దృష్టిలో పెట్టుకుని డీజిల్ సరఫరాపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అలాగే పెట్రోల్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని వాహనదారులు, రైతులు కోరుతున్నారు.

## న్యాయవాదిపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలి

**- నిందితులను శిక్షించాలని డిమాండ్**

**- విధులు బహిష్కరించిన న్యాయవాదులు**



**కోరుట్ల** సీనియర్ న్యాయవాది గంగుల సత్యార్థప్రకాశ్ పై దాడి హేమమైన చర్య అని న్యాయవాదులకే రక్షణ కరువైతే సామాన్యుల పరిస్థితి ఏంటి అని ఇట్టి విషయం ప్రజలు ఒక చర్చలు మారిందని తెలుపుతూ సోమవారం కోరుట్లలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసో సియేషన్ అధ్యక్షులు తోట ఆంజనేయులు మాట్లాడుతూ ఒక సీనియర్ న్యాయవాదిపై దాడి చేయడం హేమమైన చర్యని న్యాయవ్యవస్థలో న్యాయవాదులకే రక్షణ కరువైతే సామాన్యంగా పరిస్థితి ఏంటని ప్రజలు చర్చించుకుంటున్నారని అన్నారు. ఇప్పటికైనా దాడికి పాల్పడిన నిందితులను అరెస్టు చేసి దాడి వెనుక ఎంతటి వారున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రధాన కార్యదర్శి సుతారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 24 శు క్రవారం రాత్రి ఆఫీస్ పని ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో మార్గమధ్యంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మాస్కులు ధరించి సీనియర్ న్యాయవాదిపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని దాడి జరిగి మూడు రోజులు జరుగుతున్న పోలీసులు నిందితులను పట్టుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని, నిందితులను గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బార్ అసోసియేషన్ పక్షాన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలువురు బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో న్యాయవాదులకే రక్షణ కరువైతే సామాన్యుల పరిస్థితి ఏంటని ఒక సీనియర్ న్యాయవాదిపై ఇలాంటి ఘటన జరగడం చాలా బాధాకరమని ఇప్పటికైనా పోలీసులు నిందితులను త్వరగా అరెస్టు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి నిందితులను పట్టుకునే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్57తామన్నారు.అనంతరం బార్ అసోసియేషన్ పక్షాన కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ కు వినతి పత్రాన్ని అందజేస్తూ నిందితులను పట్టుకొని శిక్షించాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తోట ఆంజనే యులు ప్రధాన కార్యదర్శి సుతారి శ్రీనివాస్ పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్థులను వెంటనే పరిష్కరించాలి



**జయశంకర్ భూపాలపల్లి** ప్రజావాణి దరఖాస్తులు పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు.సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. అనంతరం శాఖల వారీగా పెండింగ్ ఉన్న దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్ ఉన్న దరఖాస్తులను వచ్చే సోమవారం నాటికి పరిష్కరించాలని ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చి ప్రజలు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో దరఖాస్తులు చేస్తున్నారని, పరిష్కారంలో జాప్యం వహించొద్దని తెలిపారు. ప్రతి అధికారి బాధ్యతగా దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ రోజు జరిగిన ప్రజావాణిలో ప్రజల నుండి 73 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మంగారి మఠంలో భక్తులకు చల్లని ఊరట

**- మజ్జిగ, మంచినీళ్ల పంపిణీ**

**బ్రహ్మంగారిమఠం** శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 333వ ఆరాధన మహోత్సవాలు మఠంలో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకలకు తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా దేశ నలుమూలల నుండి భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, భక్తులకు ఉపశమనం కలిగించేలా మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ×పుట్టా సుధాకర్ యాదవ్× ఆదేశాల మేరకు ప్రత్యేక సేవా కార్యక్రమాలు చేపట్టారు.టీడీపీ మండల అధ్యక్షులు ×చెన్నుపల్లి సుబ్బారెడ్డి సూచనలతో×, కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ మరియు మంచినీళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 3,000× మజ్జిగ ప్యాకెట్లు 10,000 మంచినీళ్ల ప్యాకెట్లు ఈ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు మరియు ప్రభుత్వ అధికారులు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మైదుకూరు రూరల్ సిఐ శివశంకర్ యాదవ్, భీమటం ఎస్‌ఐ వరప్రసాద్ మజ్జిగ ప్యాకెట్లతోపాటు, మంచినీళ్ల ప్యాకెట్లను ఉత్సవాలకు వచ్చిన భక్తాదులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ వేడి ఎక్కువగా ఉన్నందువల్ల దాతలు ముందుకు వచ్చి ఇలా మజ్జిగ ప్యాకెట్లు మంచినీళ్లు అందజేయడం ఎంతో మంచి పనిని ఇంతకంటే మంచి చేయడం మరొకటి ఉండదని పారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులుఎంపీపీ వీరనారాయణరెడ్డి, యల్లటూరి సాంబశివారెడ్డి, యస్.ఆర్ శ్రీనివాసులురెడ్డి, ముదమాల పోలిరెడ్డి, పూజ శివాయాదవ్, సుధాకర్, నాగయ్య, రామసుబ్బారెడ్డి, శీలం నరసింహ గౌడ్ సూరి యాదవ్ మరియు వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.స్వామివారి ఆరాధన మహోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఈ చలివేంద్రం తరహా పంపిణీని చేపట్టామని. కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జునరెడ్డి తెలిపారు

## తాడిపత్రిలో వైసీపీ కార్యకర్త దారుణహత్య

**తాడిపత్రి** తాడిపత్రిలో వైకాపా కార్యకర్త అబ్దుల్ అలియాస్ బండాను దుండగులు నరికి చంపారు. తాడిపత్రి పట్టణంలోని ఏటిగడ్డపాళ్యంలో ఘటన జరిగింది. ఇంటికి వెళ్తుండగా మాటువేసి గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసారు.

## నందిగామలో నో డీజిల్.. నో స్టాక్

**నందగామ**నందిగామ లో డీజిల్ దొరక పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రికమండేషన్ ఉంటే బంక్ సిబ్బంది డిజిల్ ఇస్తున్నారని ఆరోపించారు. రికమండేషన్ ఉన్న ఫుల్ ట్యాంక్ అవ్వదని అంటున్నారని అన్నారు. కృత్రిమ కొరత సృష్టిస్తున్న ఆరోపించారు. డీజిల్ ధరలు పెరుగుతాయన్న ఊహాగానాలతో లోడ్ ఉన్నా సరే డీజిల్ కొట్టడం లేదంటున్నారు వాహన దారులు..తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు బంక్ ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

## మే 2 నుండి 8 వరకు వైభవంగా పదకవితా పితామహుడు అన్నమయ్య 618వ జయంతి ఉత్సవాలు

తాళ్లపాక, రాజంపేట, తిరుపతిలో ఆధ్యాత్మిక కళోత్సవాల సందడిసంకీర్తనలతో శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన పదకవితా పితామహుడు శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులవారి 618వ జయంతి ఉత్సవాలు మే 2 నుండి 8వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. అన్నమయ్య జన్మస్థలమైన తాళ్లపాకలోని ధ్యానమందిరం, రాజంపేటలోని 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద, తిరుపతిలోని మహతి కళాక్షేత్రం, అన్నమాచార్య కళామందిరంలలో జయంతి కార్యక్రమాలను నిర్వహించనున్నారు.తాళ్లపాకలో..తాళ్లపాకలోని ధ్యానమందిరంలో మే 2వ తేదీన ఉదయం 9 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. మొదటగా అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు మరియు స్థానిక కళాకారులచే సప్తగిరి సంకీర్తన గోష్ఠిగానం నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీవారి కల్యాణం కన్నుల పండుగగా జరుగనుంది. ఇందులో భాగంగా మే 2 నుండి 8వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు గాత్ర సంగీతం, హరికథ, నృత్య, నాటక ప్రదర్శన కార్యక్రమాలు జరుగనున్నాయి. రాజంపేటలోని 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద మే 2వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు ఊంజల్ సేవ జరుగనుంది. అదేవిధంగా మే 2 నుండి 8వ తేదీ వరకు సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు సంగీత, వాద్య, హరికథ కార్యక్రమాలు జరుగనున్నాయి.తిరుపతిలో..తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో మే 2వ తేదీ ఉదయం 9 గంటలకు సప్తగిరి సంకీర్తన గోష్ఠిగానంతో జయంతి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఉదయం 10 నుండి 11.30 గంటల వరకు సంగీత సభ, ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు హరికథ గానం జరుగనుంది. మే 3 నుండి 7వ తేదీ వరకు ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు సాహిత్య సదస్సులు జరుగనున్నాయి. మే 8వ తేదీ ఉదయం 8 గంటలకు శ్రీ కోదండరామస్వామివారి ఆస్థానం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు సంగీత సభ, హరికథ గానం జరుగనుంది. ఇందులో భాగంగా మే 2 నుండి 8వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు గాత్ర సంగీతం, నృత్య, వాద్య, హరికథ కార్యక్రమాలు జరుగనున్నాయి. మహతి కళాక్షేత్రంలోనూ మే 2 నుండి 8వ తేదీ వరకు సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు సంగీత, నృత్య, వాద్య కార్యక్రమాలు జరుగనున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నమయ్య సంకీర్తనల సౌరభాన్ని ఆస్వాదించాలని టిటిడి విజ్ఞప్తి చేస్తోంది.

## వైద్య కళాశాల భవననిర్మాణ పనులను వేగవంతం చేయాలి



**జయశంకర్ భూపాలపల్లి** వైద్య కళాశాల మరియు వైద్య విద్యార్థుల వసతి భవనం (హాస్టల్) పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆర్ అండ్ బి, వైద్య కళాశాల ప్రిన్సిపల్, ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, టీజీఎంఐడీసీ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణ పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో లేవని, చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నప్పటికీ పనులు ఆలస్యమవ్వడం సరికాదన్నారు. పనుల్లో వేగం పెంచేందుకు లేబర్ మొబిలైజేషన్‌ను పెంచాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరపు వైద్య అడ్మిషన్లు పూర్తి అయి విద్యార్థులు కళాశాలకు రానున్న నేపథ్యంలో, అప్పటికి అన్ని నిర్మాణ పనులు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా బెడ్స్, ఫర్నిచర్ తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటులో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా రాజేంద్రప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, టిజి ఎం ఎస్ ఐడిసి ఏఈ రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్‌లో చెత్త సేకరణ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ కౌన్సిలర్ల హెచ్చరిక

**"ప్రైవేట్ వాహనాలతో చెత్త సేకరణ చేస్తే భారీ ఆందోళనలు"**

**- కౌన్సిలర్ సత్యలక్ష్మి యాదగిరి**



గజ్వేల్( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్‌లో మున్సిపల్ పరిధిలో చెత్త సేకరణను ప్రైవేటు పరం చేసే యత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు కాంగ్రెస్ కౌన్సిలర్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కౌన్సిలర్ నాయిని సత్యలక్ష్మి యాదగిరి మాట్లాడుతూ, చెత్త సేకరణపై రాజకీయాలు చేయవద్దని, మున్సిపల్ ద్వారానే చెత్త సేకరణ కొనసాగాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ ఏర్పడి మూడు నెలలు కూడా గడవకముందే చెత్త సేకరణను ప్రైవేటీకరించడం సరైన పద్ధతి కాదని వారు విమర్శించారు. ప్రజలు ఇప్పటికే ఇంటి పన్నుల రూపంలో మున్సిపాలిటీకి చెల్లింపులు చేస్తున్నారని, అలాంటప్పుడు ప్రైవేట్ వాహనాలను ప్రవేశపెట్టడం అనవసరమని పేర్కొన్నారు. ప్రైవేట్ చెత్త సేకరణ వాహనాలను అనుమతిస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. "మున్సిపల్ ద్వారానే చెత్త సేకరణ ముద్దు, ప్రైవేట్ వద్దు" అనే నినాదంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గుంటుకు లక్ష్మి శ్రీనివాస్, నక్క సంతోషి, రాములు గౌడ్, రమేష్, ఉపేందర్ రెడ్డి, నరసింహారెడ్డి, షరీఫ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## రైతులూ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

**సన్న ధాన్యానికి రూ 500 బోనస్ చెల్లిస్తాం**

**వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్)ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్ పేర్కొన్నారు. సిఈఓ జితేందర్ రెడ్డితో కలిసి సోమవారం మజీద్ పల్లి, అంబర్ పేట, వేలూరు, నాచారం, మైలారం, వర్గల్, తునికి ఖల్సా, నెంటూర్, పాములపర్తి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించే పంటలు దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. సన్న ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన రూ 500 బోనస్ ఇస్తున్నట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని అన్నారు. కాగా గ్రేడ్ మొదటి రకం ధాన్యానికి రూ 2389/బి రెండవ రకం ధాన్యానికి రూ రూ 2369/బి ప్రభుత్వం చెల్లిస్తున్నట్లు చెప్పారు. రైతులను చైతన్యం చేస్తే హరీష్ ఆర్థికంగా తీర్చిదిద్దాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు, నేతలు చెన్నయ్య, కుమార్, యాదగిరి, రాజశేఖర్ రెడ్డి, కొండల్ రెడ్డి, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న నారా భువనేశ్వరి దేవి



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని ఆదివారం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి దేవి దర్శించుకున్నారు. వారికి మొదటగా ఆలయసాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికిన ఆలయ అర్చకులు, ప్రత్యేక వేద ఆశీర్వచనాలు అందజేశారు.దర్శనం అనంతరం ఆలయ ఈవో భవానీశంకర్, స్వామి వారి లడ్డు ప్రసాదం,చిత్ర పటంఅందచేశారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దర్శనార్థం వచ్చిన సందర్భంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు ఆలేరు



నియోజకవర్గం ఇన్చార్జి రేగు బాల నరసయ్య యాదగిరిగుట్ట మండల పార్టీ అధ్యక్షులు మచ్చ నరసింహ గౌడ్ పట్టణ అధ్యక్షులు చిత్తర్ల శ్రీనివాస్ గౌడ్ వారికి స్వాగతం తెలియజేసారు.

# తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిద్దాం

**- బీఆర్ఎస్ పార్టీ నాయకులు : ఏనుగుల మనోహర్ రెడ్డి,నిమ్మశెట్టి విజయ్**





వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, పార్టీ జెండా ఆవిష్కరించి, స్వీట్లను పంపిణీ చేశారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారులను ఆత్మీయంగా సన్మానించారు.
ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, మాజీ చైర్‌పర్సన్ ఢ కౌన్సిలర్ రామతీర్థపు మాధవి, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, ఏనుగు తిరుపతి రెడ్డి, నిమ్మశెట్టి విజయ్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, డా. వాసాల శ్రీనివాస్, సిరిగిరి చందు, కందుల క్రాంతి, మారాం కుమార్, జోగిని శంకర్, నిమ్మశెట్టి రాజు, పబ్బ మహేష్, పోతు అనిల్, రవీందర్, అంజత్ పాషా, అసద్, ఉమర్, కనకరాజు, గోస్కుల నర్సయ్య, నీరటి మల్లేశం, గుడిసె సదానందం, రేగుల రాజేశం, వెంకట్ రెడ్డి, కృపాల్, మహేందర్ యాదవ్, ప్రకాష్, బండి అనిల్, సతీష్ రెడ్డి, గుడిసె అనిల్, దేవరాజు, రాము, రాజు, ప్రేమ్ చారి, రాధాకిషన్ రావు, దేవానంద్, భాస్కర్, హరీష్, నాగుల నరేందర్, రవిచంద్ర, శ్రీను, నరేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో బీఆర్ఎస్ పాత్రను గుర్తుచేసుకుంటూ, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# గజ్వేల్‌లో ఎయిర్‌టెల్ నూతన స్టోర్ ప్రారంభం

**ఎయిర్టెల్ స్టోర్ వారు మెరుగైన సేవలందించాలి**

**మున్సిపల్ చైర్ పర్సన్ చందన రవీందర్**

గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణం, పరిసర ప్రాంత ప్రజలకు ఎయిర్‌టెల్ సంస్థ శుభవార్త అందించింది. గజ్వేల్ అంగడిపేట హనుమాన్ దేవాలయం వద్ద నూతనంగా ఎయిర్‌టెల్ స్టోర్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ పాల్గొని రిబ్బన్ కట్ చేసి స్టోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, వ్యాపారానికి అనుకూలమైన కేంద్రమని, ఎయిర్టెల్ స్టోర్ వారికి, అభినందనలు తెలుపుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు అనంతరం ఎయిర్ టెక్ స్టోర్ నిర్వాహకులు గంగిశెట్టి ప్రవీణ్ మాట్లాడుతూ.. వినియోగదారులకు మరింత చేరువగా ఉండి వేగవంతమైన సేవలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. కొత్త ఎయిర్‌టెల్ ప్రీపెయిడ్ మరియు పోస్ట్‌పెయిడ్ సిమ్ కార్డులు, ఇతర నెట్‌వర్క్‌ల నుండి ఎయిర్‌టెల్‌లోకి మారే సదుపాయం (ఏం ఎన్ ఎన్ పి) ఉందని, ఎయిర్‌టెల్ వైఫై కనెక్షన్స్, హై-స్పీడ్ ఫైబర్ ప్లస్, మరియు అత్యాధునిక ఎయిర్‌టెల్ ఎయిర్ ఫైబర్ కనెక్షన్‌లు ఇక్కడ అందుబాటులో ఉంటాయని తెలిపారు. అలాగే ఎయిర్‌టెల్



పేమెంట్ బ్యాంక్ ద్వారా నగదు జమ, విత్‌డ్రా వంటి సేవలను పొందవచ్చని వెల్లడించారు. ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ లేదా ఇతర సేవలపై ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా నేరుగా స్టోర్‌ను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. గజ్వేల్ మరియు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రవీణ్ కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, సీనియర్ నాయకుడు గుంటుకు శ్రీనివాస్, శ్రావణ్, ఆర్యవైశ్య నాయకులు బిక్షపతి, దుబకుంట లక్ష్మణ్, ఎయిర్టెల్ స్టోర్ యజమాన్యం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గెజిట్'లో గంగపుత్ర పేరు కోసం ప్రభుత్వానికి నివేదిస్తాం

**- తెలంగాణ బీసీ కమిషన్**

**-నిర్ణయం ప్రకటించిన తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్**

**-అగ్నికుల క్షత్రియకు బదులు గంగపుత్రగా మారుస్తామని స్పష్టం**

**-త్వరలోనే ప్రభుత్వానికి కులాల పేర్ల సవరణల జాబితా**



(తేజ వ్యాస్ గంగపుత్ర -ప్రశ్న న్యూస్ బ్యూరో) తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సమావేశం సోమవారం ఉదయం 11:30 గం॥లకు ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ జి. నిరంజన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కమిషన్ ఇటీవలే తాము జరిపిన సమగ్ర కులాల సర్వేలో భాగంగా బీసీ ఏ, సీరియల్ నెంబర్ 1 లో భాగంగా మత్స్యకారుల జాబితాలో గంగపుత్ర , బెస్త , గూండ్ల కులాలకు బదులుగా తెలంగాణలో లేనటువంటి కులం అగ్నికుల క్షత్రియ పేరును తప్పుగా ప్రచురణ జరిగిన అంశంపై కమిషన్ చర్చ జరిపింది. త్వరలోనే ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం , బీసీ మంత్రిత్వ శాఖకు అధికారికంగా తాము సవరణల చేయాలని సూచిస్తామని వివరించింది. ఇటీవలే ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే 2024 నివేదిక మరియు స్వతంత్ర నిపుణుల వర్కింగ్ గ్రూప్ నివేదికలపై కూలంకషంగా చర్చింది. వీటిని మరింత లోతుగా విశ్లేషించడానికి కమిషన్‌లోని సీనియర్ అధికారుల బృందంతో ఒక కమిటి ఏర్పాటు చేయాలని కమిషన్ నిర్ణయించింది. ఆ కమిటి నివేదికను పరిశీలించిన అనంతరం కమిషన్ ఈ కుల సర్వే విషయంలో తమ పరిశీలనను ప్రభుత్వానికి సమర్పించనుంది. సర్వే రిపోర్టులో గంగపుత్ర పేరుతో వెంటనే సవరణలు చేయాలని ఇటీవలే ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఫిషరీస్ ఫెడరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ సహా గంగపుత్ర ప్రదేశ్ సంఘం నేతలు బీసీ మంత్రి గంగుల కమలాకర్, కమిషన్ సభ్యులను కలిసి వినతి పత్రం అందించారు. నిపుణుల నివేదికలో గంగపుత్ర, బెస్త గూండ్ల కులాలకు సంక్షిప్త నామంగా అగ్నికుల క్షత్రియ పేరుతో వ్యవహరించడం పట్ల అభ్యంతరాలను తెలుపుతూ ఆయా కులాల ప్రతినిధులు కమిషన్‌కు నివేదించడం జరిగింది. ఈ విషయాన్ని చర్చించిన కమిషన్ మరికొన్ని ఇతర కులాల విషయంలో కూడా సంక్షిప్త పేర్లు ప్రధాన కుల పేర్లకు విరుద్ధంగా ఉండడాన్ని కమిషన్ గుర్తించింది. ఈ విషయాన్ని సరిచేయాలని ప్రభుత్వాన్ని కోరాలని కమిషన్ నిర్ణయించింది.

2025లో జరిగిన గ్రామ పంచాయితి ఎన్నికలలో ఎన్నుకోబడ్డ వార్డు సభ్యులు మరియు సర్పంచుల వివరాల సేకరణపై పంచాయితీరాజ్ కమిషనర్‌తో చర్చించాలని కమిషన్ నిర్ణయించింది.

దేశవ్యాప్తంగా జరుగుతున్న జనాభా గణనలో భాగంగా తేది 26-04-2026 నుండి ప్రారంభమైన స్వీయగణనలో ప్రజలందరూ పాల్గొనాలని కమిషన్ కోరింది. అలాగే 2వ విడతలో తమ కుల వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. కుల సంఘాలు మరియు ప్రతినిధులు కూడా తమ కులస్తుల జనాభా నమోదయ్యేటట్టుగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఉన్న 130 వెనుకబడిన తరగతుల కులాల నమోదు కొరకు సెన్సెస్ వారు తీసుకుంటున్న చర్యలను వివరించాలని తెలంగాణ సెన్సెస్ ఆపరేషన్స్ డైరెక్టర్‌కు లేఖ రాయాలని కమిషన్ నిర్ణయించింది. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, శ్రీమతి బాలలక్ష్మి రంగు మరియు కమిషన్ మెంబర్ సెక్రెటరీ శ్రీమతి బి. బాల మాయ దేవి పాల్గొన్నారు. సమావేశంలో అధికారులు డిప్యూటి డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, ప్రత్యేక అధికారి కుమారి ఎన్. సునీత, సెక్షన్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్, రీసెర్చ్ ఆఫీసర్ జి. లక్ష్మీనారాయణ హాజరయ్యారు .

# మే 31 లోపు 30 వేల కోట్ల బకాయిలు ఉద్యోగులకు చెల్లించాలి

**- గూడూరు, సత్యవేడు, వెంకటగిరి ప్రాంతాల్లో 1000 కోట్ల అవినీతి జరుగుతోంది.**

**- పారిశుద్ధ్య కార్మికులను బానిసలుగా చూడొద్దు.**

**- నెలకు రూ.30 వేల రూపాయలు వేతనం ఇవ్వాలి.**

**- దేవలోక్, ట్రైడెంట్, ఒబెరాయ్ భూములు రద్దు చెయ్యాలి.**

**- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్.**

అలిపిరిలో పునర్జన్మ పొందిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అలిపిరి దగ్గర 1000 కోట్ల రూపాయలు విలువైన భూములను ముగ్గురు కోటీశ్వరులకు, ఒక్కొక్కరికి ముప్పై ఎకరాలు టిటిడి భూములు కట్టబెట్టారని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ తెలిపారు. దేవలోక్, ట్రైడెంట్, ఒబెరాయ్ కి ఇచ్చిన భూములు నెల రోజుల లోపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం టీటీడీ పరిపాలన భవనం దగ్గర కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి భారీ ధర్నా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతామోహన్ మీడియాతో మాట్లాడారు. టీటీడీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులను బానిసలుగా చూస్తున్నారని మండిపడ్డారు. తిరుపతి మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు, టీటీడీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మధ్య వ్యత్యాసం ఏనుగుకు, కుందేలుకు ఉన్నంత తేడా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. టీటీడీలో పది పన్నెండు వేల రూపాయలు ఇచ్చి, వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని మండిపడ్డారు. టిటిడి పారిశుద్ధ కార్మికులకు రిస్క్ అలవెన్స్ ప్రతి నెలా పదివేల రూపాయలు ఇవ్వాలన్నారు. అలాగే నెలకు 20 వేల రూపాయలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. శ్రీవారి మెట్టు మార్గంలో 32 మంది చిరు వ్యాపారులపై టీటీడీ విజిలెన్స్ దాడులు ఎక్కువైందన్నారు. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ, కుటుంబాలను పోషించుకుంటున్న చిరు వ్యాపారులపై టీటీడీ విజిలెన్స్ దాడులు ఆపాలన్నారు. పేదరికాన్ని నిర్మూలన అంటూ, పి4 అని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ఇలాంటి దుర్మార్గాలు జరగడం శోచనీయమన్నారు. మహిళా కార్మికులపై కాంట్రాక్టర్ల మేనేజర్లు వేధింపులు మానుకోవాలన్నారు

# నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో సమావేశమైన జిల్లా కలెక్టర్



సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన డిస్ట్రిక్ట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, 252 జీఓ కు అనుగుణంగా నియమ, నిబంధనలు పాటించాలని ఆదేశాలు జారీ చేశారు.మీడియా ప్రతినిధులు ప్రజలకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల సమాచారం సరిగ్గా చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు.అక్రిడిటేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని నియమ నిబంధనలు పాటించాలని, ఎప్పటికప్పుడు కమిటీ సభ్యులతో అన్ని విషయాలు చర్చించి ముందుకు వెళ్లాలని తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు కలెక్టర్ కు శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీపీఆర్ఓ ఏడుకొండలు, సీపీఓ శ్రీనివాసాచారి, డిస్ట్రిక్ట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు దండి సంతోష్ కుమార్, సయ్యద్ లాయక్ పాషా, హింగే శ్రీనివాస్, టీవీ నారాయణ, సయ్యద్ ఆసిఫ్ అలీ సదత్, దాసరి దేవేందర్, కాంబోజు ముత్తయ్య, ఏదుల తిరుపతి, మ్యాన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాధనలో బీఆర్ఎస్ పాత్ర చరిత్రాత్మకం

**- బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు : కత్తెరపాక కొండయ్య**

**- మండల కేంద్రంలో ఘనంగా బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బిఆర్ఎస్ పార్టీ జెండాను ఘనంగా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య,పార్టీ మండల ప్రధానకార్యదర్శి గుంటి శంకర్ పాల్గొని పార్టీ శ్రేణులు, ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో బిఆర్ఎస్ పార్టీ పాత్ర చారిత్రాత్మకమని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, అభివృద్ధి, సంక్షేమమే పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పార్టీ స్థాపన నుంచి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న బిఆర్ఎస్ భవిష్యత్తులో కూడా ప్రజల పక్షాన నిలబడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల తాజా మాజీ సర్పంచులు, మాజీ ప్యాక్స్ చైర్మన్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# గృహాల లెక్కింపులో బీసీలకు అన్యాయం

**- బిఎస్పీ జిల్లా ప్రధానకార్యదర్శి : మాంకాళి తిరుపతి**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) బీఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాంకాళి తిరుపతి మాట్లాడుతూ గృహాల లెక్కింపులో బీసీలకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా బీసీ కులగణన డిమాండ్ పెరుగుతున్నప్పటికీ, ప్రస్తుతం జరుగుతున్న గృహ సర్వేలో 34 కాలమ్స్‌లో ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీ కాలమ్ లేకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఫిబ్రవరిలో జరిగే జనగణనలో బీసీల గణన ఎలా చేస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.కేంద్ర హోం మంత్రి అమిత్ షా కులగణన చేస్తామని ప్రకటించినా, గెజిట్ నోటిఫికేషన్‌లో ఆ అంశం లేకపోవడం బీసీల హక్కులను దెబ్బతీసే చర్య అని అన్నారు. అలాగే సర్వేలో ఎస్సీలకు మత పరిమితులు విధించడం, ఎస్టీలకు మాత్రం అన్ని మతాలకు అనుమతి ఇవ్వడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.ఈ సమావేశంలో చొప్పదండి అసెంబ్లీ అధ్యక్షులు కాంపెల్లి రాజు, కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షులు ఉల్లేందుల మహేష్, మానకొండూర్ అసెంబ్లీ అధ్యక్షులు కుమ్మరి సంపత్, నిషాని సురేష్, బడుగు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంఘమిత్రలకు మొబైల్ ఫోన్ల పంపిణి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) పట్టణంలోని పురపాలక శాఖ కార్యాలయంలో సంఘమిత్రలకు మొబైల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిపాల్గొని 200 మంది సంఘమిత్రలకు మొబైల్ ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా శక్తి ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో కీలకమని, ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ కంటా రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు, టిడిపి నాయకులు నాగరాజు నాయుడు, గాదిపాకుల గోపి, ఖాదర్ భాషా, బషీర్, మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, బుజ్జి, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# డి-5 కాలువ పనులు పూర్తి చేయాలి

**- తహసీల్దార్ కు వినతి**

**- కాలువ నిర్మాణం పూర్తయితే రైతులకు సాగునీటి సమస్యలు తొలగుతాయి**

**-బూరుగుపల్లిగ్రామ సర్పంచ్ : పెంచాల సౌమ్య - మహేష్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, బూరుగుపల్లి గ్రామంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డి-5 కాలువ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య -మహేష్ ఆధ్వర్యంలో గ్రామ పాలకవర్గ సభ్యులు సోమవారం తహసీల్దార్ కు వినతిపత్రం సమర్పించారు.వినతిపత్రంలో ముఖ్యంగా మధ్యలో ఆగిపోయిన కాలువ పనులను వెంటనే పునఃప్రారంభించాలని, కాలువకు సంబంధించి పునఃసర్వే నిర్వహించి స్పష్టమైన హద్దులు నిర్ణయించాలని కోరారు. హద్దుల గుర్తింపు పూర్తయితే మిగిలిన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ పెంచాల సౌమ్య - మహేష్ మాట్లాడుతూ, కాలువ నిర్మాణం పూర్తయితే రైతులకు సాగునీటి సమస్యలు తొలగుతాయని తెలిపారు. హద్దుల విషయంలో స్పష్టత లేకపోవడం వల్లే పనులు నిలిచిపోయాయని అన్నారు. దీనిపై ఎంఆర్ఓ సానుకూలంగా స్పందించి, త్వరలోనే పునఃసర్వే చేపట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గుట్టలో ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

**పట్టణ సెక్రెటరి జనరల్ పాపట్ల నరహరి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ**



యాదగిరిగుట్ట(ప్రశ్న న్యూస్) బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యాదగిరిగుట్ట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ జెండాను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీతోనే తెలంగాణకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఇప్పుడు ఎన్నికలు వచ్చినా బిఆర్ఎస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన బిఆర్ఎస్ జెండాను ఆవిష్కరించి పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులకు సీట్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పేరబోయిన సత్యనారాయణ , ఆరే శ్రీధర్ గౌడ్, కల్వకొలను సతీష్ బట్, అంకం నరసింహ, బూడిద సురేందర్, కొన్యాల నరసింహారెడ్డి, గ్యాదపాక క్రాంతి, దండ్ల బాను, కరుణాకర్ మోతే నరసింహ , సిహెచ్ చిరంజీవి, మిట్ట వెంకటేష్ గౌడ్, సర్దార్, పబ్బాల సాయి చందు, ఆకుల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బాలల భద్రత తల్లిదండ్రుల గురువుల బాధ్యత



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) తల్లిదండ్రులు, గురువులు బాలలపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, చదువులతోపాటు ఆటలను కూడా ప్రోత్సహించాలని, తగిన పౌష్టికాహారం అందించాలని ఐసిడిఎస్ ఈవో వనిత అన్నారు. రాచర్ల గొల్లపల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వనిత ఆధ్వర్యంలో రెండు అంగన్వాడి కేంద్రాల చిన్నారులకు గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో బాలల భద్రత డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్సై రాహుల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ఐసిడిఎస్ ఈవో వనిత మాట్లాడుతూ బాలికల పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చిన్నారులకు చదువులతో పాటు క్రీడల్లో పాల్గొనేలా చేయాలని, పౌష్టికాహారం అందిస్తేనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని తల్లులకు తెలియజేశారు. గ్రామంలోని మూడు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలని గ్రామ పెద్దలకు కోరారు. అంగన్వాడి కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారమైన కోడిగుడ్లు, బాలామృతం, పాలు, స్నాక్స్ చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ ఈవో వనిత పిలుపునిచ్చారు. ఎస్సై రాహుల్ రెడ్డి, తాసిల్దార్ సుజాత, సర్పంచ్ కొండ రమేష్ మాట్లాడుతూ డ్రగ్స్ కు యువత బానిసలు అవుతున్నారని డ్రగ్స్ నిర్మూలన కోసం అందరూ కృషి చేయాలన్నారు. మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని, ఎల్ఐసి ఉన్నవారు హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపవద్దని అన్నారు గ్రామంలో యువకులు డ్రగ్స్, సిగరెట్లు తాగకుండా తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిపిఓ సుజాత, రాజేశ్వరి, ఏఎన్ఎం రిభిక పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, అంగన్వాడీ టీచర్లు మంజుల శ్రీమతి, అనిత, జ్యోతి ,, ఆశా కార్యకర్తలు అందే జ్యోష్న, దేవ లక్ష్మి పాటి శోభ పాల్గొన్నారు.

# రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించి విద్యార్థుల్లో భరోసా నింపాలి

**- భాజపా జిల్లా సీనియర్ నేత, బీసీ నాయకులు : అనుమల్ల చంద్రమౌళి**



కొత్తపల్లి / కరీంనగర్ (ప్రశ్న న్యూస్) ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేసి, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకువచ్చి విద్యను పేదవాడి హక్కుగా మార్చాలని బీసీ సంఘం నాయకులు, భాజపా కరీంనగర్ జిల్లా సీని6నాయకులు అనుమల్ల చంద్రమౌళి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.8,500 కోట్ల బకాయిల చెల్లింపులో జాప్యం కారణంగా ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం చెల్లించే వరకు విద్యార్థులే ఫీజులు చెల్లించాలన్న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను పునఃపరిశీలించి, బకాయిల విడుదలకు కోర్టు డెడ్‌లైన్ విధించాలని విజ్ఞప్తి చేశారు. పేద కుటుంబాల విద్యార్థులు ఫీజులు భరించలేని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కార్పొరేట్ విద్యాసంస్థల్లో వాణిజ్య ధోరణిని అరికట్టేందుకు ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, పెండింగ్ బకాయిలు చెల్లించి విద్యార్థులు, తల్లిదండ్రులు, యాజమాన్యాల్లో ఉన్న ఆందోళనను తొలగించాలని కోరారు. అలాగే విద్యకు తగిన నిధులు కేటాయించి నాణ్యమైన విద్య అందించాలన్నారు.

# భీంగల్ నూతన తహసీల్దార్‌కు ఘన సన్మానం - శుభాకాంక్షలు

**- మండల ప్రజలకు అందుబాటులో ఉండి పారదర్శకంగా సేవలందించాలి**

**- భీంగల్ మున్సిపల్ మాజీ చైర్మన్ : మల్లెల లక్ష్మణ్**



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా,భీంగల్ మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కిరణ్ కుమార్‌ను సోమవారం భీంగల్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లెల లక్ష్మణ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లెల లక్ష్మణ్ మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండేలా పారదర్శకంగా సేవలు అందించాలని తహసీల్దార్ కిరణ్ కుమార్‌కు సూచించారు.ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ అంజూమ్ అలీ భాయ్, ఎస్పీ రత్నం, దైడి సురేష్, తోట హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్ -ఆరుగురు మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ**



సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో అందజేసిన కుట్టు మిషన్లను మహిళలు సద్వినియోగం చేసుకొని. ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి టెక్స్టైల్ పార్కులో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన మహిళలకు కుట్టు శిక్షణ కొనసాగుతుండగా, జిల్లా కలెక్టర్ అప్పుడు పరిశీలించారు. కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చారు అడిగి తెలుసుకున్నారు. ఎన్ని రోజులుగా శిక్షణ పొందుతున్నారని అడిగారు. శిక్షణలో ఏ ఏ మెలుకువలు అందిస్తున్నారు అనే అంశాలపై ఆరా తీశారు. వారిలో నిరుపేదలకు కుట్టు మిషన్లు ఇస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన రామిడి లక్ష్మి, బత్తిని అశ్విని, పోతూరి లావణ్య, దొరగళ్ల ప్రేమలత, పోతూరి నిర్మల, మంద సుమలతకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కుట్టు మిషన్లను కలెక్టర్ అందజేశారు. అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ కుట్టు మిషన్లను మహిళలు సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. ఇటీవల చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో అందించిన శిక్షణలో మెలకువలు వినియోగిస్తూ యూనిఫాంలు, ఇతర డ్రెస్సులు, ఆధునిక డిజైన్లతో డ్రెస్సులు కుట్టాలని పేర్కొన్నారు. ఆర్థికంగా రాణించి మిగతా వారికి ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ కోరారు.కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఏడీ సంతోష్, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.



# రాజ్ చాలా గ్రేట్

**– భర్తపై సమంత ప్రశంసలు**

దర్శకుడు, నిర్మాత రాజ్ నిడిమోరును ప్రముఖ సినీ నటి సమంత వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇద్దరికీ ఇది రెండో వివాహం కావడం గమనార్హం. మరోవైపు, వీరి జీవిత ప్రయాణం సంతోషంగా, అన్యోన్యంగా ముందుకు సాగుతోంది. వ్యక్తిగతంగానే కాకుండా వృత్తిపరంగానూ సమంత-రాజ్ నిడిమోరుల బంధం మరింత బలపడుతోంది. 'ది ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్: హనీ బన్నీ' వంటి విజయవంతమైన ప్రాజెక్టుల తర్వాత, ఇప్పుడు ఈ జంట 'మా ఇంటి బంగారం' సినిమా కోసం జట్టు కట్టారు. సమంత సొంత బ్యానర్ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' ద్వారా రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నందినీ రెడ్డి దర్శకత్వంలో వస్తున్న ఈ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా వెన్నెల కిషోర్ అడిగిన 'మీ ఫ్యామిలీ మ్యాన్' ఎలా ఉంటారు? అనే ప్రశ్నకు సమాధానంగా.. "రాజ్ చాలా గ్రేట్, ఆయనో అద్భుతమైన క్రియేటర్" అంటూ సమంత తన భర్తపై ప్రశంసలు కురిపించడం వారి మధ్య ఉన్న గౌరవాన్ని చాటిచెబుతోంది.

2025 డిసెంబర్ 1న కోయంబత్తూరులోని ఈశా యోగా సెంటర్‌లో అత్యంత నిరాడంబరంగా జరిగిన వీరి వివాహం అప్పట్లో పెద్ద సంచలనం. ఇప్పుడు పెళ్ళైన తర్వాత వస్తున్న వీరి కాంబినేషన్లో వస్తున్న తొలి చిత్రం కావడంతో ఫ్యాన్స్ ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఒక సాధారణ గృహిణి పవర్‌ఫుల్ మహిళగా ఎలా మారిందనే కాన్సెప్ట్‌తో 'ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్టైనర్'గా వస్తున్న ఈ సినిమా మే 15న విడుదల కానుంది.

# ఓటీటీలో దూసుకుపోతున్న 'వశీకరణం'



క్షుద్ర శక్తులకు సంబంధించిన కంటెంట్ పట్ల కుతూహలాన్ని కనబరిచే ప్రేక్షకుల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. దెయ్యలకి సంబంధించిన హారర్ థ్రిల్లర్ సినిమాల తరువాత, ఈ తరహా కంటెంట్ పట్ల ఆసక్తిని చూపించేవారి శాతం ఎక్కువే. భయపడుతూ చూడటంలోనే థ్రిల్ ఫీలవుతూ ఉంటారు. అందువల్లనే ఈ తరహా కథలు ఓటీటీ సెంటర్లలోకి వరుసగా దిగిపోతున్నాయి. అలా 'సోనీ లివ్' ఓటీటీ ఫ్లాట్ ఫామ్ పైకి వచ్చిన హిందీ సిరీస్ గా 'వశీకరణం : కిస్ పర్ రఖే విశ్వాస్' కనిపిస్తుంది. మార్చి 16వ తేదీ నుంచి ఈ సిరీస్ నుంచి ఎపిసోడ్స్ వదులుతూ వస్తున్నారు. ప్రతి సోమ వారం నుంచి శుక్రవారం వరకూ అందుబాటులోకి వస్తున్న కొత్త ఎపిసోడ్స్ తో ఈ సిరీస్ దూసుకుపోతోంది. ఇంతవరకూ ఈ సిరీస్ నుంచి 30 ఎపిసోడ్స్ ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. స్నేహలత వసైకర్ ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సిరీస్, ప్రస్తుతం హిందీ భాషలో మాత్రమే అందుబాటులో ఉంది. త్వరలో తెలుగులోను అందుబాటులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మహారాష్ట్ర ప్రాంతంలోని ఒక మారుమూల గ్రామంలో సుమన్ అనే శ్రీమంతురాలు ఉంటుంది. ఆ ఇంట్లో పెత్తనమంతా ఆమెదే. ఆమె కనుసైగలలోనే అన్ని పనులు జరిగిపోతూ ఉంటాయి. ఆమెకి ఎదురు మాట్లాడటానికి పనివాళ్లెవరూ సాహసించరు. ఆమెకి వశీకరణ విద్యలో ప్రవేశం ఉంటుంది. అందువలన పౌర్ణమి రోజులలో రహస్యంగా ఆమె ఆ తాంత్రిక విద్యను ప్రయోగిస్తూ ఉంటుంది.

ఒక వ్యవసాయ కూలీ తల్లి ఈ విషయాన్ని బయటికి చెప్పడంతో అసలు కథ మొదలవుతుంది. భారీతనం .. నేపథ్య సంగీతం .. ఫొటోగ్రఫీ ఈ సిరీస్ ప్రధానమైన బలంగా నిలిచాయి.

# లగ్గం టైమ్' మూవీ రివ్యూ!



తెలుగు తెరపై ఇప్పుడు చిన్న సినిమాల జోరు కొనసాగుతోంది. దాంతో చిన్న సినిమాల ద్వారా చాలామంది హీరోలు .. హీరోయిన్లు పరిచయమవుతున్నారు. ఓ మాదిరి బడ్జెట్ లో తెరకెక్కించే సినిమాల కోసం ఎక్కువగా రొమాంటిక్ లవ్ స్టోరీస్ ను ఎంచుకుంటున్నారు. అలా రూపొందిన సినిమానే 'లగ్గం టైమ్'. రాజేశ్ మేరు – నవ్య చిట్యాల జంటగా నటించిన ఈ సినిమా, ఫిబ్రవరి 6వ తేదీన థియేటర్లకు వచ్చింది. ఈ నెల 25వ తేదీ నుంచి 'ఆహా'లో అందుబాటులోకి వచ్చింది. సూర్య (రాజేశ్) 'కరీంనగర్' కి చెందిన యువకుడు. తన స్నేహితుడైన 'మాధవ్' పూణెలో జాబ్ చేస్తూ ఉండటంతో, తాను కూడా అక్కడ ఏదైనా జాబ్ చూసుకోవచ్చుననే ఆశతో వెళతాడు. మాధవ్ రూమ్ లో ఉంటూ ఉద్యోగాన్ని వెతుక్కునే పనిలో పడతాడు. అప్పటికే అనన్య (నవ్య) పూణెలో జాబ్ చేస్తూ ఉంటుంది. అదే ఆఫీస్ లో పనిచేసే 'బేబీ'తో కలిసి ఆమె ఒక ఫ్లాట్ లో ఉంటూ ఉంటుంది. అనన్య ఆఫీసులోనే పనిచేస్తున్న మాధవ్, బేబీతో ప్రేమలో ఉంటాడు. అలా మాధవ్ – బేబీ ద్వారా సూర్యకి అనన్య పరిచయమవుతుంది. సూర్య తొలి చూపుతోనే అనన్యను ఆరాధించడం మొదలు పెడతాడు. ఆమెకి మరింత దగ్గర కావాలంటే, ఆమె ఆఫీసులో జాబ్ సంపాదించాలని నిర్ణయించుకుంటాడు. సూర్యను ఇష్టపడుతున్న అనన్య, అతను తన ఆఫీసులో జాయిన్ కావడానికి అవసరమైన సాయం చేస్తుంది. అలా వాళ్లిద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారుతుంది. అనన్యను పెళ్లి చేసుకోవాలని సూర్య నిర్ణయించుకుంటాడు. అదే సమయంలో రియల్ ఎస్టేట్ బిజినెస్ చేసే అనన్య తండ్రి బలరామ్ (భోగిరెడ్డి శ్రీనివాస్) ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కుంటూ ఉంటాడు. ఆ సమస్య నుంచి బయటపడటం కోసం, అదే ఊరుకి చెందిన సుబ్బరాజు (కేదార్ శంకర్) కొడుకు చందూ (నెల్లూరు సుదర్శన్)కి అనన్యను ఇచ్చి పెళ్లి చేయాలని నిర్ణయించుకుంటాడు. అందుకు సంబంధించిన 'లగ్గం' కూడా ఖరారై పోతుంది. సరిగ్గా 'లగ్గం టైమ్'కి సూర్య ఏం చేస్తాడు? అతను తీసుకున్న నిర్ణయం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుంది? అనేది కథ. ఒక పరిచయం స్నేహంగా మారడానికీ .. ఆ స్నేహం ప్రేమగా మారడానికి ఎంతో కాలం పట్టదు. అయితే ప్రేమ ముదిరిన తరువాతనే అసలు కథ మొదలవుతుంది. ఆ ప్రేమ పెళ్లిపీటల వరకూ వెళ్లే క్రమంలో ఎన్నో అవాంతరాలను .. అడ్డంకులను ఎదుర్కోవలసి ఉంటుంది. ఆడపిల్లలు తమ కుటుంబ పరిస్థితులకు .. పేరెంట్స్ మాటకు కట్టుబడి ఉండవలసి వస్తుంది. అలాంటి పరిస్థితులలో అబ్బాయిలు తీసుకునే నిర్ణయంపైనే ఆ ప్రేమకథ ఆధారపడి ఉంటుంది. అలాంటి ఒక ప్రేమకథనే ఇది. ప్రేమించుకోవడానికి ఇద్దరి అభిప్రాయాలు .. అభిరుచులు కలిస్తే సరిపోతుంది. ప్రేమించుకోవడానికి ఎవరి అనుమతులతో పనిలేదు. కానీ పెళ్లి దగ్గరికి వచ్చేసరికి, ఇద్దరూ తమ కుటుంబాలను ఒప్పించవలసి ఉంటుంది. అందుకు అవకాశం లేకపోతే ఏమౌతుంది? ఆ ప్రేమజంట ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుంది? అనే ప్రధానమైన అంశం చుట్టూనే ఈ కథను తిప్పుతూ వెళ్లారు. సాధారణంగా ప్రేమకథల్లో విలన్స్ గా అమ్మాయి పేరెంట్స్ గానీ .. అబ్బాయి పేరెంట్స్ గాని కనిపిస్తూ ఉంటారు. వాళ్లు పెట్టే పరీక్షలను ఆ ప్రేమజంట దాటుకుంటూ వెళ్లడమే ఆడియన్స్ లో ఆసక్తిని రేకెత్తిస్తూ ఉంటుంది. అయితే ఈ కథలో .. ఈ విషయంలో దర్శకుడు కాస్త కొత్తగా ఆలోచన చేశాడనే చెప్పాలి. ప్రేమ పక్షులు ఎగరకుండా అడ్డుపడుతున్నది ఎవరనే ఒక కుతూహలాన్ని పెంచడానికి ప్రయత్నం చేశారు. పరిచయం .. స్నేహం .. ప్రేమ .. పెళ్లి పీటల దిశగా అడుగులు .. దాదాపు ప్రేమకథలన్నీ ఇదే ఫార్మేట్ లో ముందుకు వెళుతూ ఉంటాయి. ప్రేమకథలో గాఢంగా కనిపించవలసింది ఫీల్. రొమాన్స్ .. ఎమోషన్స్ ఏదైనా అందులో మనసుకు హత్తుకునే ఫీల్ ఉండాలి. పాటల్లోను ఆ ఫీల్ తప్పకుండా పండాలి. లవ్ స్టోరీస్ కి సున్నితమైన కామెడీ కూడా అవసరమే. అయితే ఇవేవీ ఈ కథలో ఆశించిన స్థాయిలో కనిపించవు. ఇక ఈ కథలో ప్రేమికుల పాలిట విలన్ ఎవరనే విషయంలో దర్శకుడు చూపించడానికి ట్రై చేసిన కొత్తదనం కూడా పేలవంగానే అనిపిస్తుంది. హీరో – హీరోయిన్ నటన ఓ మాదిరిగా అనిపిస్తుంది. ఆడియన్స్ ను కథలోకి తీసుకుని వెళ్లడానికి ఈ స్థాయి నటన సరిపోదు. మిగతా సీనియర్ ఆర్టిస్టులు బాగానే చేశారు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. ప్రేమకథలను ఆడియన్స్ చూసి చూసి ఉంటారు. అందువలన కొత్త పాయింట్ తో వచ్చిన ప్రేమకథలను చూడటానికే ప్రేక్షకులు ఇంట్రెస్ట్ చూపిస్తారు. ఒకవేళ పాత కథనే అయినా కొత్తగా చెప్పడానికి ట్రై చేస్తే కనెక్ట్ అవుతారు. అలా కాకుండా రొటీన్ కథనే చూపించడానికి ప్రయత్నం చేస్తే అసహనానికి లోనవుతారు. అలాంటి ఒక రొటీన్ ట్రాక్ లోనే నిదానంగా .. నింపాదిగా నడిచే కథ ఇది.

# కాకినాడలో 'మకుటం' షెడ్యూల్ పూర్తి..

**– చిత్ర బృందానికి విశాల్ ధన్యవాదాలు**



కోలీవుడ్ యాక్షన్ హీరో విశాల్ తన తాజా చిత్రం 'మకుటం' కోసం జరిపిన కీలక షెడ్యూల్‌ను పూర్తి చేశారు. గత రెండు వారాలుగా ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో జరిగిన ఈ చిత్రీకరణ ముగిసినట్లు ఆయన సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ షెడ్యూల్ పూర్తి కావడంతో చిత్ర బృందం చెన్నైకి తిరిగి వెళ్లింది. సినిమాలోనే అత్యంత కష్టమైన 90ల నాటి నేపథ్యంలోని సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరించినట్లు విశాల్ తెలిపారు. ఈ రెండు వారాలు తాను తీవ్ర అనారోగ్యంతో బాధపడినప్పటికీ, పట్టుదలతో షూటింగ్ పూర్తి చేశానని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రయాణంలో తనకు సహకరించిన చిత్ర బృందానికి విశాల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. "ఎలాంటి ఇగో లేకుండా వృత్తిపట్ల అంకితభావం చూపిన నా డార్లింగ్ అంజలికి, డీఓపీ అభినందన్‌కు, బృందా మాస్టర్‌కు, నా దర్శకత్వ బృందానికి, తీవ్రమైన ఎండలను తట్టుకుని పనిచేసిన నటీనటులందరికీ ధన్యవాదాలు" అని విశాల్ తన పోస్ట్‌లో రాశారు. తనకు అండగా నిలిచిన కాబోయే అర్ధాంగి సాయిధన్సికకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం నుంచి చెన్నైలో చివరి షెడ్యూల్ ప్రారంభం కానుందని విశాల్ వెల్లడించారు. త్వరలోనే జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతంలో సినిమా నుంచి తొలి సింగిల్ విడుదల కానుందని, ఆయన మ్యాజిక్ కోసం సిద్ధంగా ఉండాలని అభిమానులకు సూచించారు. కాగా, మకుటం చిత్రానికి విశాల్ స్వయంగా దర్శకత్వం వహిస్తుండడం విశేషం ఈ చిత్రం తమిళంలో 'మగుడం' పేరుతో రూపుదిద్దుకుంటోంది.


## టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన దువ్వాడ మాధురి..

# పవర్‌ఫుల్ పాత్రతో సినీ ఆరంగేట్రం




వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తో ఉన్న అనుబంధం వల్ల రెండు తెలుగు రాష్ట్రాల్లో పాప్యులర్ అయిన మాధురి... ఇప్పుడు నటిగా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 'చీన్ టపాక్ డుం డుం' అనే విభిన్నమైన టైటిల్‌తో వస్తున్న చిత్రం ద్వారా ఆమె టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు. ఈ చిత్రంలో ఆమె ఒక కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాలో మాధురి 'గైరమ్మత్త' అనే గంభీరమైన పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. తాజాగా విడుదలైన ఆమె పోస్టర్ చూస్తుంటే, సినిమాలో ఆమె పాత్ర చాలా వైవిధ్యంగా ఉండబోతోందని అర్థమవుతోంది. 'శుభం' సినిమా ఫేమ్ గవిరెడ్డి శ్రీనివాస్ హీరోగా నటిస్తుండగా, ఆయన సరసన బ్రిగిడా సాగా హీరోయిన్‌గా నటిస్తోంది. వైఎన్ లోహిత్ దర్శకత్వంలో 'విలేజ్ టాకీస్' బ్యానర్‌పై శ్రీను నాగులపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవానికి టాలీవుడ్ స్టార్స్ తరలివచ్చారు. స్టార్ హీరోయిన్ సమంత క్లాప్ కొట్టగా, గోపిచంద్ మలినేని, నందిని రెడ్డి, వశిష్ఠ వంటి ప్రముఖులు చిత్ర బృందా నికి శుభాకాంక్షలు తెలిపారు. నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని ఆగస్టు నెలలో విడుదల చేసేందుకు యూనిట్ ప్లాన్ చేస్తోంది.

# పోలీస్‌ఆఫీసర్ తిరుపతి తడాఖా



సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రలుగా రూపొందుతున్న థ్రిల్లర్ మూవీ 'కామాఖ్య'. అభినయ కృష్ణ దర్శకుడు. వడ్డేపల్లి శ్రీవాణీనాథ్ర, యశ్వంత్ రాజ్ నిర్మాతలు. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ దశలో ఉన్నది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. ఇందులో సముద్రఖని 'తిరుపతి' అనే పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. ఆదివారం ఆయన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఈ సినిమాలోని ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. పోలీస్ ఆఫీసర్ తిరుపతిగా అద్భుతమైన స్క్రీన్ ప్రెజన్స్‌తో సముద్రఖనిని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఆనంద్, శరణ్య ప్రదీప్, వైష్ణవ్, ధనరాజ్, రాఘవ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రమేశ్ కుశేందర్‌రెడ్డి, సంగీతం: గ్యాని, నిర్మాణం: మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ ప్రై.లిమిటెడ్.

## వెంకటాపూర్ గ్రామంలో ఘనంగా

# శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల జాతర ప్రారంభం

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కౌడిపల్లి మండలం పరిధిలోని వెంకటాపూర్ బి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైన శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల జాతర ఈ సందర్భంగా వెంకటాపూర్ బి గౌడ సంఘ సభ్యులు మాట్లాడుతూ 27వ తేదీనాడు గంగమ్మ బోనాలు మరియు 28వ తేదీనాడు శ్రీ రేణుక ఎల్లమ్మ అభిషేకం అలంకరణ అన్న సంతర్పణ కార్యక్రమం మరియు, శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాలు ఉంటాయని గౌడ సంఘ సభ్యులు తెలిపారు కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని వెంకటాపూర్ బి గౌడ సంఘ సభ్యులు కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే

# పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం

**చట్టపరమైన మార్గంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందిస్తాం**

**జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు**




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, జిల్లాలోని పలు గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వివాదాలు, పోలీస్ సంబంధిత ఇబ్బందులను జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాస రావు నేరుగా విన్నవించుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ ప్రతి ఫిర్యాదుదారునితో వ్యక్తిగతంగా మాట్లాడి, వారి సమస్యలను సమగ్రంగా తెలుసుకున్నారు. అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే పరిష్కార చర్యలు తీసుకునేలా సంబంధిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొన్ని అంశాలపై సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి, వేగవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ఎలాంటి పైరవీలు అవసరం లేకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని తెలిపారు. చట్టపరమైన మార్గంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందించడమే పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు.పోలీస్ వ్యవస్థ పూర్తిగా ప్రజల కోసమేనని, ఎవరి జోక్యం లేకుండా నిర్భయంగా తమ సమస్యలను వెల్లడించాలని ప్రజలను కోరారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఇప్పటికే అనేక సమస్యలు పరిష్కారమై, ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం మరింత పెరిగిందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

# అంగన్వాడీలో గ్రాడ్యుయేషన్ డే

**అంగన్వాడి పిల్లలకు అభినందనలు తెలియజేసిన.**

**సర్పంచ్ దండే వేన సంధ్య బానేష్**




మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మండలం గుంజపడుగు గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే జరుపుకోవడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ దండేవేన సంధ్య బానేష్ హాజరై చిన్నారులను అభినందించారు ఈ సందర్భంగా సర్పంచ్ సంధ్య బానేష్ మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడి స్థాయిలో నే పునాది పడుతుందని పిల్లల అభివృద్ధికి అంగన్వాడి కేంద్రాలు అభివృద్ధి పాత్ర పోషిస్తున్నా యని అన్నారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎలుక లక్ష్మి . అంగన్వాడి ఆయాలు వరుణ, రమాదేవి, శారద, ఇందిరమ్మ, కళావతి బాలింతలు, తల్లులు అంగన్వాడి అంటే చిన్నపిల్లలకు గుడ్లు పోషకాహార పదార్థాలను అందించడమే అంగన్వాడి ప్రధాన కర్తవ్యం చిన్నారులు పాల్గొన్నారు

# ధర్పల్లిలో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



ధర్పల్లి(ప్రశ్న న్యూస్ ) తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఘనంగా సంబరాలు మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లిలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ పార్టీ జెండాను ఆవిష్కరించి సంబరాలను ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో పార్టీ పోషించిన కీలక పాత్రను ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేసుకున్నారు. కార్యకర్తలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ భరాస మాజీ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, సితాయిపేట్ సర్పంచ్ భూమేష్, మాజీద్, శంకర్ నాయక్, శ్రీను, నజీర్, కోటాల గంగారెడ్డి, సురేందర్గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో

# రియల్ టైం డేటా ఎంట్రి చేపట్టాలి...

**- మంథని సహకార సంఘం అఫిషియల్ పర్సన్ ఇంచార్జి కె.అనిల్ కుమార్**





మంథని ( ప్రశ్న న్యూస్) వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రియల్ టైం డేటా ఎంట్రి చేపట్టాలని మంథని సహకార సంఘం అఫిషియల్ పర్సన్ ఇంచార్జి కె.అనిల్ కుమార్ ట్యాబ్ ఆపరేటర్లకు సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మంథని కార్యాలయంలో సెంటర్ ఇంచార్జీలు, ట్యాబ్ ఆపరేటర్లకు అవహగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంథని సహకార సంఘం అఫిషియల్ పర్సన్ ఇంచార్జి కె.అనిల్ కుమార్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసే సమయంలోనే అప్పటికప్పుడు ట్యాబ్ లో డేటా ఎంట్రి చేయాలని, ఖచ్చితంగా నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని అన్నారు. అలాగే జీపిఎస్ ఉన్న వాహనాల ద్వారా మాత్రమే రైస్ మిల్లులకు ధాన్యం రవాణా చేయాలని అన్నారు.

వరి ధాన్యం లోడ్ చేసే సమయానికి మీకు ఏ మిల్లు కేటాయించారో ముందే తెలియదని, ఇకపై మాన్యువల్ మిల్లు అలాట్ మెంట్ ఉండదని అన్నారు. ఆన్ లైన్ లో ట్రక్ చిట్ జనరేట్ చేసిన తర్వాత మాత్రమే ఆటోమేటిక్ గా రైస్ మిల్లు పేరు చూపిస్తుందని, ట్రక్ చిట్ లో ఏ మిల్లు పేరు చూపిస్తుందో ఆ మిల్లు కు మాత్రమే ధాన్యాన్ని పంపించాలని సూచించారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో సెంటర్ ఇంచార్జీలు తప్పనిసరిగా రికార్డు ల్లో ఎప్పటికప్పుడు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు, ట్రాన్స్పోర్ట్ చేసిన ధాన్యం వివరాలు విధిగా నమోదు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా ప్యాడి క్లీనర్లతో ధాన్యాన్ని శుభ్రపర్చాలని, 17 శాతం తేమ కలిగిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని అన్నారు. రైతులు సెంటర్ కు ధాన్యం తీసుకువచ్చే సమయంలోనే వారి నుంచి అదార్ కార్డు జీరాక్స్, పట్టా పాస్ పుస్తకం జీరాక్స్, బ్యాంకు పాసు పుస్తకం జీరాక్స్, ఓటిపి వచ్చే సెల్ నంబర్ ను సేకరించాలని అన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, సంఘ సిబ్బంది, సెంటర్ ఇంచార్జీలు, ట్యాబ్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్‌తోనే తెలంగాణ సాధన

**ఉద్యమానికి దిశా నిర్దేశం చేసిన పార్టీ బిఆర్ఎస్.**

**పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు.**


**బీఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం తెలంగాణ రాష్ట్ర సాధనకు కీలక మలుపుగా నిలిచిందని మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున గౌడ్,పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులుఅన్నారు.కేసీఆర్ నాయకత్వంలో ప్రారంభమైన ఉద్యమం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిందని పేర్కొన్నారు.మెదక్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు,మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున గౌడ్, పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణ కోసం ఎన్నో దశాబ్దాలుగా కొనసాగిన పోరాటానికి బిఆర్ఎస్ పార్టీ ఒక వేదికగా మారిందన్నారు. కేసీఆర్ దూరదృష్టి, పట్టుదల వల్లే ఉద్యమం సాఫల్యం సాధించిందని తెలిపారు.తెలంగాణ ఉద్యమ కాలంలో విద్యార్థులు, యువత, ఉద్యోగులు, రైతులు ఇలా అన్ని వర్గాల ప్రజలు ఏకమై బిఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచారని గుర్తుచేశారు. ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు, ప్రాంతీయ అసమానతలను తొలగించేందుకు పార్టీ నిరంతరం కృషి చేసిందన్నారు. ఆ పోరాట ఫలితంగానే 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని చెప్పారు.రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా బిఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్లిందన్నారు. రైతులకు సాగునీరు, 24 గంటల విద్యుత్, పేదలకు గృహాలు, మహిళలకు ఆర్థిక సహాయం వంటి అనేక పథకాలు అమలు చేసి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చిందని వివరించారు. గ్రామీణ అభివృద్ధి, పట్టణ మౌలిక వసతుల మెరుగుదలలో కూడా ప్రభుత్వం విశేష కృషి చేసిందని తెలిపారు.ప్రస్తుతం కూడా బీఆర్ఎస్ పార్టీ ప్రజల కోసం అంకితభావంతో పనిచేస్తోందని, భవిష్యత్తులో తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకిరెడ్డి.కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ గడ్డమీద కృష్ణ గౌడ్,లింగారెడ్డి,కౌన్సిలర్లు దీపక్ కుమార్,సోహెల్, మాజీ కౌన్సిలర్ లు మాయ. మల్లేశం, చంద్రకళ, విజయలక్ష్మి, ఆర్కే శ్రీనివాస్,నాయకులు ప్రభు రెడ్డి, ఏనుగుల రాజు,గట్టేష్,సాదిక్, ఇందాద్, సాయ గౌడ్, ఇస్మాయిల్, సునీల్, సాయికుమార్,మహిళా నాయకురాలు రాధా,లత తదితరులు పాల్గొన్నారు.

## సితాయిపేట్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో

# 5 రోజుల ప్రతిష్ఠా మహోత్సవాలు




ధర్పల్లి (ప్రశ్న న్యూస్) మే 5 నుండి 9 వరకు వైభవంగా కార్యక్రమాలు ఉ. 7:35 ని.లకు శ్రవణ నక్షత్రయుక్త వృషభ లగ్న పుష్కరాంశ శుభ ముహూర్తం. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం సితాయిపేట్ గ్రామంలో శ్రీ పద్మావతి గోదాసమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి నూతన దేవాలయ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలు మే 5 నుండి 9 వరకు 5 రోజుల పాటు అంగరంగ వైభవంగా ర్వహించనున్నారు.

కార్యక్రమ వివరాలు

**తేది: 05-05-2026 - సోమవారం**

షోడశస్తంభ యాగశాల నిర్మాణం

**తేది: 06-05-2026 - మంగళవారం**

ఉ. 8 గం.లకు శోభాయాత్ర. సాయంత్రం 5 గం.లకు విష్ణు సహస్రనామ పారాయణం, 6 గం.లకు గోపూజ, సభాప్రార్థన, విఘ్నేశ్వర ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధనం, బుట్టికేవర్ణం, మృత్సంగ్రహణం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, అజ్యారోహణం, వాస్తుహోమం, అజ్యారాది హోమం, లఘు పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ.

**తేది: 07-05-2026 - బుధవారం**

ఉ. 6 గం.లకు సుప్రభాత సేవ, 8 గం.లకు విఘ్నేశ్వర ఆరాధన, లఘు వాసుదేవ పుణ్యాహవాచనం, ద్వారతోరణ ధ్వజ కుంభారాధన, ఉప ప్రధాన కుంభ ఆవాహనాలు, అగ్నిప్రతిష్ఠాపనం. స్వామి వార్ల మూల మంత్ర హవనములు, వరుణ హోమం, లఘు పూర్ణాహుతి, మహానివేదన, యాగశాల బలిహరణ, మంగళ నీరాజనం. సా. 6 గం.లకు విష్ణు సహస్రనామ పారాయణం, మహా కుంభారాధన, సకల దేవతా గాయత్రి హోమం, క్షీరాధివాసం, తీర్థప్రసాద వితరణ.

**తేది: 08-05-2026 - గురువారం**

ఉ. 6 గం.లకు సుప్రభాత సేవ, ద్వారతోరణ, ధ్వజకుంభ ఆరాధన, సకల దేవతల మూల మంత్ర హోమాలు, శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్ల మూల మంత్ర మహా సుదర్శన హోమం, లఘు పూర్ణాహుతి, మహానివేదన. సా. 6 గం.లకు విష్ణు సహస్రనామ పారాయణం, మహాకుంభ ఆరాధనలు, ఇత్యాది షోడశ ప్రాణాదశవాన్యాస హవనములు, మూలమంత్ర హవనములు, శయ్యాధివాసం, చామాది వాసం, ధనాధివాసం, ఫలాధివాసం, పుష్పాధివాసం.

**తేది: 09-05-2026 - శుక్రవారం**

ఉ. 5 గం.లకు సుప్రభాత సేవ, ప్రతిష్ఠ దేవతల మూలమంత్ర హోమాలు, ప్రాణ ప్రతిష్ఠ హోమం. లిఉ. 7:35 ని.లకులి శ్రవణ నక్షత్రయుక్త వృషభ లగ్న పుష్కరాంశ శుభ ముహూర్తమున యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన. పంచసూక్త పరివార ప్రాయశ్చిత్త హోమం, మహాపూర్ణాహుతి, శాంతి హోమం, కుంభ ఉద్వాసన, కుంభ ప్రోక్షణ, ప్రథమ దర్శనం, విశేష పుష్పాలంకరణ, అర్చన, మహా నివేదన, మహా మంగళ నీరాజనం, శ్రీవార్ల శాంతి కళ్యాణం, కుష్మాండ బలిహరణ, మహదాశీర్వచనం, తీర్థప్రసాద వితరణ.

భగవత్ ప్రియ బంధువులందరూ అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ అభివృద్ధి కమిటీ గ్రామ ప్రజలు కోరారు. శ్రీవారి అనుగ్రహం ఉంటే అన్నీ ఉన్నట్లేనన్నారు.

## దివ్యాంగుల మధ్య బిజెపి చీఫ్ జన్మదిన వేడుకలు



నాచారం (ప్రశ్న న్యూస్) బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు జన్మదిన వేడుకలను నాచారంలో ఘనంగా నిర్వహించారు. బిజెపి ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రవి నాయక్ ఆధ్వర్యంలో నాచారంలోని సాధన మానసిక దివ్యాంగుల కేంద్రంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దివ్యాంగులకు మిఠాయిలను బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవి నాయక్ మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేస్తున్న వ్యక్తి రామచందర్ రావు అని అన్నారు. పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తున్న వ్యక్తి అని కొనియాడారు , రాబోయే కాలంలో రామచంద్రరావు ఆధ్వర్యంలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. రామచంద్రరావు ఇంకా ఎన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆయురారోగ్యాలతో ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు పాల్గొన్నారు.

# పోలీస్ లైన్‌లో దళిత క్రైస్తవ శాంతి ర్యాలీ




కరీంనగర్ పోలీస్ లైన్‌లో మత స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్న 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో దళిత క్రైస్తవ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న పాస్టర్లు, విశ్వాసులు "ఆయుతంగా ముందుకు సాగుదాం... న్యాయం సాధిద్దాం... మన హక్కులను కాపాడాలి" అనే నినాదాలతో శాంతియుతంగా తమ నిరసనను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ, 1950 రాష్ట్రపతి ఉత్తర్వుల వల్ల దళిత క్రైస్తవులు అనేక హక్కులను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మతాన్ని మార్చుకున్నందుకు సామాజిక న్యాయం దూరమవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. దేశంలో ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించాలంటే ఈ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దళిత క్రైస్తవులకు రాజ్యాంగ హామీలు అమలు చేయాలని, వారి సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పాస్టర్లు తిమోతి జయరాజ్, జాషువా, ఎలీషా విన్సెంట్, లుయిస్ కుమార్ బాబు, నోవా జాకోబ్,గజ్జెల అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అంతా ఆర్భాటమే

## - కేసీఆర్ మాటల్లో పదును ఉంది, చేతల్లో లేదు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాటల్లో ఉండే పదును చేతల్లో ఉండదు. గత రెండు సంవత్సరాల నుంచి ఇదే తంతు నడుస్తుంది. ఎప్పుడో ఒకసారి సమావేశాలకు రావడం హడావిడి చేయడం తర్వాత కలుగులో దూరడం అలవాటుగా మారింది. తెలంగాణ ఎన్నికలు ఇంకా మూడేళ్లు మాత్రమే సమయం ఉంది. అయితే ఒక ఏడాది ముందు వచ్చి హడావిడి చేసినంత మాత్రాన సరిపోదు. నిత్యం జనంలో ఉండేందుకు ప్రయత్నించాలి. ఆయన ఆరోగ్యం సహకరించకపోవచ్చు. కానీ బాగున్న సమయంలోనైనా జిల్లాల పర్యటనలు చేస్తే ఆ జిల్లాల క్యాడర్ లో కొంత ఊపు వస్తుంది.

### - మూడు సభలంటూ..

కొన్నాళ్ల క్రితం పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై మూడు భారీ బహిరంగ సభలను ఏర్పాటు చేస్తానని కేసీఆర్ ఆర్భాటంగా ప్రకటించారు. ఇది ప్రకటించి నెలలు గడిచింది. తర్వాత ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో ఆ యా జిల్లాల నేతలతో సమావేశమై సభల ఏర్పాటు పై చర్చించారు. మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో జరిగే సభలకు తానే స్వయంగా హాజరవుతానని ప్రకటించారు. అసలు దానిని అటకెక్కించారు. అంతకు ముందు వరంగల్ లో జరిగిన ఆవిర్భావ సభలో ఇక జనంలో ఉంటానని ప్రజా సమస్యలపై పోరాడతానని, ప్రభుత్వం మెడలు వంచుతానని కేసీఆర్ ప్రకటించారు. కానీ ఏడాది పూర్తయినా అతీ లేదు. గతీ లేదు.

### - ఫలితాలు వచ్చిన రోజు..


ఈ విషయాన్ని ఎవరో చెప్పలేదు. కేసీఆర్ మరమనిషి అని, మారిన మనిషి అని, సారు జనం సమస్యలను గురించి పట్టించుకోవడం మానేశారని సాక్షాత్తూ ఆయన కుమార్తె టీఆర్ఎస్ ఆవిర్భావ సభలోనే వ్యాఖ్యానించారు. అందులో నిజం ఉండబట్టే కవిత ఆ వ్యాఖ్యలు చేసి ఉంటారు. కేసీఆర్ ప్రజల్లోకి వస్తే ఆ క్రేజ్ వేరు. క్యాడర్ లో ఆ కిక్కు వేరు. కానీ సారు రారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజున ప్రగతి భవన్ నుంచి కారులో ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కు వెళ్లిన కేసీఆర్ ఇప్పటి వరకూ ప్రజా సమస్యలపై స్పందించలేదు. అందుకే అధికార పార్టీ కూడా



బీఆర్ఎస్ ను లైట్ గా తీసుకుంటుంది. కేసీఆర్ నేడు ఇంతే రేపు అంతే ఎప్పుడైనా అంతేనన్న కామెంట్స్ సొంత పార్టీ నుంచి వినిపిస్తున్నాయి. మరి కేసీఆర్ ఇప్పటికైనా జనంలోకి వస్తారా? రారా? అన్నది చూడాలి.

# ఫిర్యాదులకు పరిష్కారం ఎక్కడ.?

- ప్రజావాణి పేరు మాత్రమే మిగిలిందా.?
- వస్తున్న ఫిర్యాదులు ఎన్ని.? తీర్జన సమస్యలు ఎన్ని.?
- సమస్య తీరకుండానే, తీర్చమని తప్పుడు మెసేజీలు
- ప్రజావాణి అంటేనే తలలు పట్టుకుంటున్న ప్రజలు
- అధికారుల అవినీతి నిర్లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డ పేరు




హైదరాబాద్(ప్రశ్న న్యూస్) ప్రజల సమస్యలు విని, వాటికి త్వరితగతిన పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిరిగి ప్రారంభించిన "ప్రజావాణి" కార్యక్రమం నేటి పరిస్థితుల్లో ప్రజలకే భారంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయి చివరికి ఆశగా మున్సిపల్ కమిషనర్ కార్యాలయాలలో, కలెక్టర్ కార్యాలయాలలో, ప్రజా భవన్ లోని ప్రజావాణిని ఆశ్రయించినా అక్కడ కూడా నిరాశే ఎదురవుతోందని ఆవేదన ప్రజల నుండి వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ సోమవారం జరిగే ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు తమ సమస్యలతో హాజరవుతున్నారు. భూమి వివాదాలు, పెన్షన్ సమస్యలు, రేషన్ కార్డులు, గృహాల మంజూరు, ఇంటి టాక్స్ లు, రోడ్ల సమస్యలు, ప్రభుత్వ స్థలాల కబ్జా సమస్యలు, రోడ్ల ఫుట్ పాత్ ఆక్రమణ సమస్యలు, ఉద్యోగ సంబంధిత ఇబ్బందులు ఇలా ఎన్నో సమస్యలను అధికారులు ఎదుట ఉంచుతున్నా, వాటి పరిష్కారంలో మాత్రం అసలు స్పష్టత కనిపించడం లేదన్న విమర్శలు వెలువెతుకుతున్నాయి. ఫిర్యాదులు స్వీకరించడం వరకు మాత్రమే పరిమితమవుతున్న అధికార యంత్రాంగం, వాటిని పరిష్కరించడంలో పూర్తిగా విఫలమవుతోందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదుల సంఖ్య ఎంత.? అందులో ఎన్ని పరిష్కరించబడ్డాయి.? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి.? అనే విషయాలపై ప్రభుత్వం వద్ద ఎక్కడా స్పష్టమైన సమాచారం లేదు. ప్రజావాణి కార్యక్రమం పై పారదర్శకత లేకపోవడం వల్ల ప్రజల్లో అనుమానాలు మరింత పెరుగుతున్నాయి. సమస్య పరిష్కారం కాకపోయినా, "మీ ఫిర్యాదు పరిష్కరించబడింది" అంటూ తప్పుడు మెసేజ్‌లు పంపుతున్నారని పలువురు ఫిర్యాదు దారులు చెబుతున్నారు. ఇది ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తోందని అంటున్నారు.

గతంలో కెసిఆర్ పాలనలోనూ ఇదే పరిస్థితి ఉండేదని విమర్శలు వచ్చాయి. ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చినా, అధికారుల పని తీరులో కనీస మార్పు కనిపించడం లేదు కానీ మరింత పరిస్థితి దిగజారిపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాలకులు మారినా పాలన విధానం మారలేదన్న అభిప్రాయం బలపడుతోంది. అధికారుల బాధ్యతారాహిత్యం, అవినీతి ఆరోపణలు ప్రజల సమస్యలను మరింత క్లిష్టతరం చేస్తున్నాయి. కొందరు అధికారులు ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకోకుండా కాలక్షేపంగా వ్యవహరిస్తున్నారని, కొన్ని సెటిల్మెంట్లు చేసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. పైగా సమస్యలను పరిష్కరించకుండా ఫైళ్లను తిరగేస్తూ కాలం గడుపుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ప్రజావాణి కార్యక్రమం అసలు ఉద్దేశం ప్రజలకు న్యాయం చేయడం. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అది కేవలం ఒక కాలక్షేపన కార్యక్రమంగా మారిపోయిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫిర్యాదులు స్వీకరించడం మాత్రమే కాకుండా, వాటి పరిష్కారానికి గడువు నిర్ణయించి, అమలు స్థాయిలో పర్యవేక్షణ ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని ప్రజావాణి వ్యవస్థపై సమగ్ర సమీక్ష చేయాలి. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రతి ఫిర్యాదుకు ట్రాకింగ్ సిస్టమ్ ఉండి, దాని ప్రగతి ప్రజలకు తెలియజేయాలి.

బాధ్యత వహించని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేకపోతే ప్రజల సమస్యలు అలాగే మిగిలిపోతూ ప్రజావాణి మీద ఉన్న విశ్వాసం పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రజల కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థలు నిజంగా ప్రజలకు ఉపయోగపడాలంటే, పాలకుల మాటల్లో కాదు కార్యరూపంలో మార్పు రావాల్సిందే.

# మార్చుకోకుంటే.. ఇబ్బందులే

## - సంప్రదింపులు.. సలహాలు ఎక్కడ.?



అమరావతి (ప్రశ్న న్యూస్) వైఎస్ జగన్ నిర్ణయాలను ఆ పార్టీ నేతలే తప్పు పడుతున్నట్లుగానే ఉంది. ప్రధానంగా మావిగన్ తో పాటు అనేక అంశాల విషయంలో జగన్ తీసుకునే నిర్ణయాలు సహేతుకంగా లేవని పార్టీ నేతలే ఆఫ్ ది రికార్డుగా చెబుతున్నారు. మావిగన్ విషయంలో వైసీపీ కీలక నేత ఒకరు జగన్ పై చేసిన వ్యాఖ్యలను టీడీపీ సోషల్ మీడియా వైరల్ చేస్తుంది. అయితే తాను ఆ వ్యాఖ్యలను చేయలేదని నేత చెబుతున్నప్పటికీ ఎక్కువ మంది అభిప్రాయం అలాగే ఉందన్న అభిప్రాయం టీడీపీ బలంగా సోషల్ మీడియాలో వైరల్ చేస్తుంది. ఏదైనా ఒక కీలక ప్రకటన చేసే ముందు ముఖ్యమైన నేతలను, ఆ ప్రాంతనేతలతో సంప్రదించడానికి జగన్ కు ఏం ఇగో అడ్డమన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### - వైసీపీ నేతలకే ఇష్టం లేదా

దీని ప్రకారం చూస్తే వైసీపీ నేతలే మావిగన్ ప్రతిపాదనను వ్యతిరేకించారంటే మిగిలిన ప్రాంత నేతలు ఎందుకు వ్యతిరేకించరన్నది అర్థమవుతుంది. అయితే జగన్ లో తొలి నుంచి ఒక లోపం స్పష్టంగా కనపడుతుంది. అన్నీ ఏకపక్ష నిర్ణయాలే. తనకు తోచింది మీడియా ముందు చెబుతారు. అధికారంలో ఉన్నప్పుడు అమలు చేశారు.

విపక్షంలో ఉన్నప్పుడు నిర్ణయాలను ప్రకటిస్తారు. అధికారంలో ఉన్నప్పుడు వాలంటీర్ల వ్యవస్థపై పార్టీ సీనియర్ నేతలతో పాటు అందరి నిర్ణయాలను తీసుకుంటే బాగుండేది. అలాగే ఎన్నికల సమయంలో సీట్లను మార్పు చేసినప్పుడు కూడా సీనియర్ల సలహాలు తీసుకోవచ్చు.

### - నిర్ణయాలన్నీ బూమ్ రాంగ్

అసలు వైసీపీకి ఒక పొలిట్ బ్యూరో ఉందో లేదో తెలియదు. ఏ విషయం కూడా జగన్ సీనియర్ నేతలతో చర్చించే అలవాటు లేదు. ఇదే ఆయన నిర్ణయాలు బూమ్ రాంగ్ అవుతున్నాయి. గతంలో మూడు రాజధానుల విషయంలోనూ, వాలంటీర్ల వ్యవస్థ విషయంలోనూ, అభ్యర్థుల ఎంపికలోనూ, చివరకు మావిగన్ వరకూ అన్నీ సొంత నిర్ణయాలేనా? ఎవరైనా ఇచ్చిన ఐడియాలా? అన్నది పక్కన పెడితే మొత్తం మీద జగన్ ఏకపక్ష నిర్ణయాలు పార్టీలో అసంతృప్తిని, అసహనాన్ని పరోక్షంగా వెళ్లగక్కు తున్నారు. ఇప్పటికైనా జగన్ గుర్తించి తగిన సలహాలు, సూచనలు సీనియర్ల నుంచి తీసుకుంటే బాగుంటుందన్న సూచనలు వెలువడుతున్నాయి.

# మరోసారి ఇరాన్ దూకుడు

## - భారతీయులున్న ట్యాంకర్‌పై కాల్పులు



టెహ్రాన్ (ప్రశ్న న్యూస్) పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఒమన్‌లోని షినాస్ ఓడరేవు సమీపంలో భారతీయ నావికులున్న ఒక రసాయన ట్యాంకర్‌పై ఇరాన్ కోస్ట్ గార్డ్ కాల్పులు జరిపినట్లు భారత ఓడరేవులు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది. టోగో దేశ జెండాతో ప్రయాణిస్తున్న 'ఎంటీ సైరన్' అనే ఈ ట్యాంకర్‌లోకి కొందరు వ్యక్తులు ప్రవేశించినట్లు తెలిపింది. ఏప్రిల్ 25న ఈ ఘటన జరిగిందని, ఆ సమయంలో ఆ నౌక సమీపంలో ఇతర నౌకలు కూడా ఉన్నాయని షిప్పింగ్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మందీప్ సింగ్ రణధావా తెలిపారు. పశ్చిమాసియాలో తాజా పరిణామాలపై జరిగిన అంతర్-మంత్రిత్వ శాఖల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. ఇరాన్ కోస్ట్ గార్డ్ హెచ్చరికగా ఈ కాల్పులు జరిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో భారత నావికుల భద్రత, నౌకల కార్యకలాపాల కొనసాగింపు కోసం విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయాలతో కలిసి నిరంతరం సమన్వయం చేసుకుంటున్నామని రణధావా వివరించారు. డీజీ షిప్పింగ్ కంట్రోల్ రూమ్ ఇప్పటివరకు 7,780 కాల్స్, 16,650 ఈమెయిల్లను స్వీకరించిందని, 2,770 భారత నౌకలతో సంప్రదింపులు జరుపుతోందని తెలిపారు. "ప్రస్తుతానికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం" అని ఆయన స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో ఇరాన్ నుంచి ఇటువంటి దాడులు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఏప్రిల్ 22న భారత్‌లోని ముంద్రా పోర్టుకు వస్తున్న ఒక నౌకపై, అలాగే ఏప్రిల్ 18న హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న రెండు భారత నౌకలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది. ఈ ఘటనలపై భారత్ అప్పట్లోనే ఇరాన్‌కు తీవ్ర నిరసన తెలిపింది. అయితే, అనుమతి లేకుండా తమ జలాల్లోకి ప్రవేశించడం వల్లే దాడి చేశామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ నేవీ (ఐఆర్జీసీ-ఎన్) ప్రకటించింది.

# పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవాల రోజు సెలవు

## - పోలీసులకు తెలంగాణ డీజీపీ శుభవార్త




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర పోలీసులకు డీజీపీ శివధర్ రెడ్డి శుభవార్త చెప్పారు. ఇక నుంచి పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవాల రోజున ప్రత్యేక సెలవు తీసుకోచ్చని తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. నిత్యం విధి నిర్వహణలో ఒత్తిడికి లోనయ్యే పోలీసు సిబ్బందికి ఈ ప్రత్యేక సెలవు గొప్ప ఉపశమనంగా చెప్పవచ్చు. పోలీసులు నిత్యం ఒత్తిడిలో పనిచేస్తూ వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించలేకపోతున్నారని డీజీపీ తెలిపారు. వారికి మానసిక ఉల్లాసంతో పాటు కుటుంబ బంధాలు బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అత్యవసర పరిస్థితులు మినహా సిబ్బందికి సెలవులు మంజూరు చేయాలని ఆదేశించారు. ఆధారాలు, దరఖాస్తు ఆధారంగా సెలవులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. కఠినమైన పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తూ, సమాజ రక్షణ కోసం తమ వ్యక్తిగత జీవితాన్ని, సంతోషాన్ని పోలీసులు త్యాగం చేస్తున్నారని తెలిపారు. అందుకే ఇలాంటి నిర్ణయం తీసుకున్నామని అన్నారు. సిబ్బందిలో పని, వ్యక్తిగత జీవితం సమతుల్యతను పెంపొందించడంతో పాటు, వృత్తి పట్ల వారి అంకితభావానికి గుర్తుగా ఈ గౌరవం కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో డీజీపీ పేర్కొన్నారు.

# కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలి

## - మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే ప్రతి కార్యకర్త ధ్యేయం కావాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. బీజేపీ తన కుటిల యత్నాల్లో భాగంగా తెలంగాణలో సెక్యులర్ ఓట్లను తొలగించేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, అడ్డదారుల్లో ఓట్లను తొలగించే కుట్రను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. బూత్ లెవల్ ఏజెంట్ నియామకం, పనితీరు విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకూడదని అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్ఠత కోసం బూత్ లెవల్ ఏజెంట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాలపై ప్రజాపాలన సాగుతోందని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లేని సంక్షేమ పథకాలు మన వద్ద అమలవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ఇది సాధారణ విషయం కాదని పేర్కొన్నారు. ఇది ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. వచ్చేసారి 2023 ఎన్నికల ఫలితాలు మళ్లీ రిపీట్ కావాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో అత్యధిక పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలు గెలవడమే తమ లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. త్వరలో కార్పొరేషన్ పదవుల భర్తీ ఉంటుందని హామీ ఇచ్చారు. నాయకులు తమ సమయంలో 80 శాతాన్ని పార్టీ కోసం కేటాయించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్ఠంగా ఉంటేనే భవిష్యత్తు విజయాలు సాధ్యమవుతాయని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588